కర్నూలు | నంద్యాల
వార్త
23 సెప్టెంబర్ , 2023 శనివారం పేజీలు 4

# నంద్యాల్లో ఘనంగా.. నిమజ్జనం..!

- జైబోలో గణేష్‌మహారాజ్‌కు అంటూ నినాదాలతో ఊరేగింపు
- జిల్లా కలెక్టరు, ఎస్పీ కార్యాలయల నుంచి నిమజ్జనానికి ప్రారంభం





నంద్యాల, సెప్టెంబరు 22, ప్రభాతవార్తః
వినాయక విగ్రహాలకు విద్యుత్ అలంకరణతో చూడముచ్చటగా రంగు రంగుల విద్యుత్ దీపాలతో శోభావర్ణంగా అలంకరించారు. పట్టణంలో వందలాది విగ్రహాలు ఒకదాని వెంట ఒకటి వెళ్తుడడంతో ప్రజలు తండోప తండాలుగా తరలివచ్చారు. నిమ ్మజనం చేసే చిన్న చెరువు వద్ద క్రేన్ల సహాయంతో వినాయకుని విగ్రహాలను నీటిలో ముంచుతున్నారు. చెరువు వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా సురక్షితమైన బోట ్లను, గజ ఈతగాళ్ళను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. విగ్రహాలతో వచ్చే చెత్త సామాగ్రిని తరలించేందుకు ప్రత్యేకంగా స ్వచ్ఛత ఐ సేవ ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. చెరువులో చెత్త చెదారం లేకుండా నీటిని శు భ్రంగా ఉంచారు. గణేష్ ఉత్స వ కమిటీ సభ్యులు ఐక్యమత్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నూనెపల్లెలోని రైతునగరం వద్ద ఒక వినాయకుని లడ్డు రూ.26 వేలకు వేలం పాటలో దక్కించుకు న్నారు. ప్రభుత్వ ఉద్యోగులను పట్టణంలో అక్కడక్కడ విధి నిర్వహణలో ఉంచారు. నంద్యాల మున్సి పల్ కమిషనరు రవిచంద్రా రెడ్డి, తహశీల్దార్ శ్రీనివాసులు, ఉత్స వ కమిటీ సభ్యులు రామకృష్ణారెడ్డి, మోపూరి రవీంద్రనాద్, చలంతో పాటు వైద్యం నాగేంద్ర పలువురు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రమైన నంద్యాల పట్టణంలో గణేష్ నిమజ్జనోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వినాయకచవితి పండుగ సందర్భంగా ఐదు రోజుల క్రితం వినాయకున్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిమజ్జన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి అధ్వర్యంలో నంద్యాల డిఎస్పీ మహేశ్వర్‌రెడ్డి బందోబస్తును ఏర్పాటు చేశారు. వందలాది విగ్రహాలు ఊరేంపులో పాల్గొన్నాయి. మొదటిగా జిల్లా కలెక్టరు కార్యాలయం నుంచి జాయింట్ కలెక్టరు రాహుల్‌కుమార్‌రెడ్డి, డిఆర్వో పుల్లయ్యలు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రఘువీర్‌రెడ్డి అధ్వర్యంలో గణేష్ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు.

## విచ్చలవిడిగా.. మద్యం అమ్మకాలు..!

నంద్యాల, సెప్టెంబరు 22, ప్రభాతవార్తః
జిల్లా కేంద్రంలో నంద్యాల్లో వినాయక నిమజ్జనం సందర్భంగా జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఇచ్చిన అదేశాలు పట్టించుకోవడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ప్రభుత్వ నిబంధ నల ప్రకారం నిమజ్జనం రోజున అన్ని మద్యం దుకాణాలు బంద్ చేయాలని స్పష్టమైన అదేశాలు న్నప్పటికి కొన్ని మద్యం దుకాణాలు రోజంతా తెరచి ఉండడం విశేషం. ప్రజలు కూడ మద్యం దుకాణాలు తెరిచి ఉండడంపై ఒకింత అశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. సాయంకాలం ప్రభుత్వం మద్యం దుకాణాలు విద్యుత్ దీపాలు అర్పి మద్యం అమ్ముతున్నారు. అధికారులు దీనిపై సమగ్ర విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు.




## లోకేష్ ఒక్కపిలుపునిస్తే.. ఉద్యమం ప్రభంజనం..!

- భూమా అఖీలప్రియ ఆమరణ నిరాహారదీక్షకు పెరుగుతున్న మద్దతు
- మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, కోట్ల సుజాతమ్మ, గౌరుచరితా సంఘీభావం

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా మాజీమంత్రి భూమా అఖీల ప్రియ ఆమరణ నిరాహారదీక్ష చేపట్టిన విషయం విధితమే. శుక్రవారం నిరాహారదీక్ష రెండవరోజు నిరాహారదీక్ష కొనసాగుతుంది. దీక్షకు మద్దతుగా కర్నూలు జిల్లా నుంచి కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి,మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, మాజీ ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డిలు సంఘీభావం తెలిపారు. యవనాయకుడు భూమా జగత్‌విఖ్యాత్‌రెడ్డి, భర్త భార్గవవర్ధన్‌తో పాటు తన చిన్నారి కొడుకుతో దీక్షలో కూర్చోవడం పలువురిని అకట్టుకుంది.

నంద్యాల ,సెప్టెంబరు 22, ప్రభాతవార్తః
దీక్షకు హాజరయిన కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అరెస్టు అక్రమమని ఎలాంటి అధారాలు, రుజులు లేకుండా అరెస్ట్ చేశారని పేర్కొన్నారు. మన రాష్ట్రంలోనే కాకుండా దేశంలోను, ప్రపచంలోను చంద్రబాబుకు వస్తున్న మద్దతును చూసి వైసీపీ నాయకుల గుండెల్లో గుబులు రేపుతుందన్నారు. అఖీల ప్రియ మాట్లాడుతూ లోకేష్ ఒక పిలుపునిస్తే ఉద్యమం ప్రభంజనంలా సాగుతుందన్నారు. చంద్రబాబును ఎక ్కడైతే అరెస్టు చేశారో అక్కడి నుంచే ఉద్యమం తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల నుండి దీక్షకు మద్దతుగా వందలాది మంది తరలివస్తున్నారని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీని తరిమికొట్టె రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు.ప్రముఖ న్యాయవాది తాతిరెడ్డి తులసిరెడ్డితో పాటు బోయలకుంట్ల శ్రీకాంత్‌రెడ్డి, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు. రెండురోజులుగా నిరాహారదీక్ష చేపట్టడంతో ఆమెలో షుగర్ లెవెల్ తగ్గాయని బిపి కూడ డౌన్ అవుతుందని చంద్రబాబు నాయుడును వెంటనే విడుదల చేయాలని కార్యకర్తలు, నాయకులు డిమాండ్ చేశారు.



## గణేష్ నిమజ్జనంకు.. పకడ్బందీగా ఏర్పాట్లు చేయండి

- జిల్లా కలెక్టర్ డాక్టర్.జి.సృజన



కర్నూలు, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త :
ఈ నెల 26 వ తేదీన గణేష్ నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్.జి.సృజన అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పై వివిధ శాఖల అధికారులు, గణేష్ ఉత్స వ కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ డా.జి.సృజన రెండవ కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరం తర్వాత కర్నూలులో భారీ ఎత్తున నిమజ్జనం జరుగుతుందని, ఈ సందర్భంగా ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, ఎవరి మనోభావాలు దెబ్బ తినకుండా తగిన ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ఈ సంవత్స రం నీటి ఎద్దడి ఉన్న పరిస్థితుల్లో బాధ్యతా యుతంగా నీటి వనరులను వినియోగించుకోవాల్సి న అవసరం మనందరి మీద ఉందన్నారు. వర్షాభావ కారణాల వల్ల,. తుంగభద్రలో ఇన్ ఫ్లో లేనందున కేసీ కెనాల్ కు ఆయకట్టు కూడా ఇవ్వాల్సి న నీటిని ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నామన్నారు.. అందువల్ల మనకు అందుబాటులో ఉన్న నీటి వనరులను వ్యర్థ పరచకుండా, ప్రజల సెంటిమెంట్లను గౌరవిస్తూనే, ప్రజల త్రాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుంటూ రెండింటిని బ్యాలెన్స్ చేసుకోవాల్సి న బాధ్యత ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రస్తుతం సుంకేసుల బ్యారేజ్ లో 1 టిఎంసి నీరు మాత్రమే అందుబాటులో ఉన్నందున గణేష్ నిమజ్జనం కోసం 0.2 టిఎంసి నీటిని మాత్రమే విడుదల చేయడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. నీటి వనరులను వృథా కాకుండా ఇంట్లో ఏర్పాటు చేసుకున్న మట్టి విగ్రహాలను ఇంట్లోనే నిమజ్జనం చేసే విధంగా ప్రజలకు తెలియచేయాలని కలెక్టర్ సూచించారు. నిమజ్జనోత్స వం సజావుగా జరిగేలా పోలీస్ బందొబస్తు చేయాలని..

2లో

## ఏ తప్పుచేయని చంద్రబాబు నిర్దోషిగా బయటకు వస్తారు

కర్నూలు న్యూసిటి ,సెప్టెంబరు 22, ప్రభాతవార్తః
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన ఆంధ్రప్రదేశాలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పయనించేలా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషిచేశారని అలాంటి చంద్రబాబు ను అక్రమంగా స్కిల్ డెవలప్‌మెంటు కేసులో అరెస్టుచేసి రిమాండ్ వుంచడాన్ని నిరసిస్తు తెలుగుదేశం పార్టీ అధ్వర్యంలో నిరాహారదీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. శుక్రవారం 10 రోజు ధర్నాచౌక్ నందు నియోజకవర్గ ఇంచార్జీ టీజి భరత్ అధ్వర్యంలో నిరాహారదీక్ష చేపట్టడం



జరిగింది. ఈదీక్షలకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎర్రసాని నాగేశ్వరయాదవ్ సంఘీభావం తెలపడం జరిగింది. ఈసందర్భంగా నాగేశ్వర్‌యాదవ్ మాట్లాడుతూ సైకో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అక్రమంగా చంద్రబాబును అరెస్టు చేశారని దీనికి స్పందిస్తు ఎక్కడికక్కడ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు నిరాహారదీక్షలు చేస్తు చంద్రబాబు నాయుడు తక్షణమే విడుదల చేయాలని మొక్కవోని దీక్షతో ఈకార్యక్రమాలు చేపడుతున్నందున ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పార్టీ ఇంచార్జీ టీజి భరత్ కర్నూలు నిరయోజకవర్గంలో చంద్రబాబు అరెస్టు అక్రమమని సంతకాలు సేకరణ ద్వారా న్యాయవాదులకు తెలియ జెప్పెందుకు సంతకాల సేకరణ చేపట్టారని ఇందుకు వారిని అభినందిస్తు మన నాయకుడు బయటకు వచ్చేంతవరకు పోరాటం కొనసా గించాని సైకో జగన్‌కు బుద్దివచ్చేలా పోరాటాలు మరింత ఉధృతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎఫ్ఐఆర్‌లో పేరులేకునా కేవలం రాజకీయ కక్షసాధింపులతోనే చంద్రబాబును అరెస్టు చేయించారని ఈ అరెస్టు సంబంధంగా ఉందని కోర్టులో ఖచ్చితంగా నిర్ధోషిగా బయటకు వస్తారని తెలిపారు.

## నిమజ్జనంలో మృతి చెందిన.. వారికి పోస్టుమార్టం..!



ఎమ్మిగనూరు,సెప్టెంబర్22 ప్రభాతవార్తః
ఎమ్మిగనూరు పట్టణంలో గణేశ్ నిమజ్జనంలో బొలెరో వాహనం డికోని ఇద్దరు మృతి చెందిన విషయం అందరికి విదితమే శుక్రవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాల నందు పోలీస్ అధికారులు, వైద్యుల సంక్షములో మనోజ్(07), (రాజు22) లకు పోస్టుమార్టం నిర్వహించి పోలిసులు కేసునమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు. పట్ట ణంలో వినాయక నిమజ్జన వేడుకలో ఎంతో మంది సంతోష వాతవారణంలో సంబరాలు చేసుకోంటున్న సమయంలో మృత్యు వారి కుంటుబాలకు కనీటిను మిగిలించిన సన్నివేశాలను ప్రజలు చూస్తు కనీటాపర్వముగా ఉండిపోయారు. విషయం తెలుసుకోన్న వైఎస్ఆర్‌సిపి నాయకులు వై రుద్రగౌడ్ మృతి చెందిన వారిని చూసి కుంటుబ వాసులను పరామర్షించి వారికి ధైరాని ఇంచి ప్రభుత్వం నుండి వారికి సహాయ సహకారాలు అందిస్తమని వారికి తెలిపారు.

## తహసిల్దార్లతో జేసీ మౌర్య సమీక్ష

: అసైన్మెంట్ భూముల లబ్దిదారుల విషయంపై సూచనలు

కర్నూలు, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త :
రెవెన్యూ అంశాలపై మండల తహసిల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య. సమీక్ష నిర్వహించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుండి ,ఆదొని సబ్ కలెక్టర్, డిఆర్‌ఓ కె మధుసూదన్ రావు పత్తికొండ, కర్నూలు ఆర్డీవోలు. జిల్లాలోని తాసిల్దార్‌లు, సర్వేయర్లు,విఆర్‌ఓ ల తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య వీడియో కాన్ఫరెన్స్ నిర్వ హించారు. మౌర్య మాట్లాడుతూ గుర్తించిన అర్హులైన లబ్ధిదారుల వివరాలను ఆన్లైన్ నందు అప్లోడ్ చేయడం లో తక్కువ పురోగతి సాధించారని, పెండింగ్ లో ఉన్న లబ్దిదారుల వివరాలను త్వరితగతిన అప్లోడ్ చేసేలా తహసి ల్దార్లు చర్యలు తీసుకోవాలని, కొన్ని మండలా లలో ప్రోగ్రెస్ తక్కువగా ఉందని అలాంటివారి పై చర్యలు తీసుకోవాలని తహసిల్దార్లను ఆదేశించామని అన్నారు. విధులు సరిగా నిర్వహించని వారి పై శాఖపరమైన టువంటి చర్యలు తీసుకొనుటకు సిఫారసు చేయాలని తహసి ల్దార్లను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. జిల్లా అసైన్మెంట్ రివ్యూ కమిటీ కొత్తగా గుర్తించిన అర్హులైన లబ్ధిదారుల వివరాలను ఆన్లైన్ నందు అప్లోడ్ చేయడం, ఈనామ్ భూముల గురించి, పాత అసైన్మెంట్ భూముల గురించి, ఆబాది సర్వే,రీసర్వే ఫేస్ 3, పిఎం కిసాన్ భూమి లింకేజ్, ఈ క్రాప్ బుకింగ్, కౌలు రైతులకు గుర్తింపు కార్డుల గురించి, క్రాప్ లోన్స్ తదితర అంశాలపై మండల స్థాయి, అధికారులతో చర్చించారు.



## జగనన్నకు చెబుదాంకు అరకొరగా ధరఖాస్తులు..!

- దిగువ కాల్వల స్థలాల్లో ఇంటి పట్టాలు ఇవ్వలేం
- స్పందనకు హాజరైన కలెక్టర్ జి.సృజన



2లో

కోడుమూరు,సెప్టెంబర్ 22, ప్రభాతవార్త ః
గత నాలుగున్నర ఏళ్ల నుంచి రా ష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు పొందేందుకు అవగాహన కొరవడడమో, ఇంకా ఎవైన కారణాల చేతనో, ఆయా శాఖల అధికారుల నిర్లక్ష్యం వంటి ఇబ్బందుల వల్లనోల్లాంటి సమస్యలతో పథకాలకు దూరం అవుతున్న అర్హులైన లబ్దిదారులకు మళ్లీ వారికి అవకాశం కల్పించి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలనే లక్ష్యంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం (స్పందన) అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్వయంగా జిల్లా కలెక్టర్ జి.సృజన,జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యలతో పాటు జిల్లా స్థాయిలోని ఆయా శాఖలకు చెందిన ..



పట్టణంలో లంబోదరుడి నిమజ్జనోత్సవం భక్త జనుల మధ్య కన్నులవిందుగా శుక్రవారం జరిగింది. భక్త జనుల జైకారాలు, ఆనందోత్సవాల మధ్య కొన్ని గణనాథులు సాయంత్రం 6 గంటలకు ప్రారంభమై నిమజ్జనోత్సవం శనివారం ఉదయం 6 గంటల వరకు కొనసాగింది. ఉత్సవకమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనోత్సవాన్ని ప్రారంభించారు.



• వివరాలు 2లో

- భక్త జనుల మధ్య కనువిందుగా కొనసాగిన నిమజ్జనోత్సవం
- జెండా ఊపి ఉత్సవాలను ప్రారంభించిన జయమనోజ్‌రెడ్డి
- ఆలస్యంగా వినాయకుల తరలింపు





## లంబోదరా.. సెలవిక..!

## యథేచ్ఛగా మద్యం..!

- తాగి తూగిన మందుబాబులు
- ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖతార్
- నిమజ్జనం సందర్భంగా ప్రభుత్వ మద్యం షాపులకు బంద్ లేదు



**ఆదోనిటౌన్, సెప్టెంబర్22, ప్రభాతవార్త ;** ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం, ఎక్సైజ్ అధిఆరులు వింత వైఖరితో మెలిగారు. ఆదోనిలో వినాయకుడి శోభాయాత్రగా నిమజ్జనానికి వెళ్లే గణనాథులను చూడ్డానికి ఆదోని పట్టణం నుంచే గాక చుట్టుపక్క ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు, మహిళలు, చిన్నారులు తరలివస్తారు. ఆదోనిలో గతంలో జరిగిన ఓ ఘటన తర్వాత ఇంతవరకు ఎన్నడూ మద్యం దుకాణాలను నిమజ్జనోత్స వం రోజున తెరిచిన దాఖలాలు లేవు. అలాంటిది ప్రభుత్వ మద్యం దుకాణాలు శుక్రవారం వినాయక నిమజ్జనం రోజున యథేచ్ఛగా కొనసాగాయి. మద్యాన్ని జోరుగా విక్రయించి ఆదాయం చేసుకున్నారు. మద్యం తాగి తూగండి.. ప్రభుత్వానికి టార్గెట్ ఆదాయమే అన్న చందంగా ప్రభుత్వ మద్యం దుకాణాలు నడుస్తున్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు. నిర్వహించిన పీస్ కమిటీ మీటింగ్‌లో నిమజ్జనం రోజున ప్రభుత్వ మద్యం దుకాణాలను బంద్ చేయాలని ఉన్నతాధికారులు తెలియజేశారా లేదా...? చెప్పినా రాత్రికి రాత్రి ఆదేశాలు మారిపోయాయా...? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల వద్ద బారులు తీరుతున్న మద్యం ప్రియులను చూసి ప్రజలు నివ్వెరపోతున్నారు. వినాయకుడి ఊరేగింపును వీక్షించడానికి వస్తున్న భక్తులు మందుబాబులను చూసి దూరంగా జరిగారు.

# లంబోదరా సెలవిక..!

**ఆదోనిటౌన్, సెప్టెంబర్22, ప్రభాతవార్త ;** అంతకముందు వినాయకుడి ప్రసాదంగా ఉంచిన లడ్డూ, హుండీకి ఉత్సవకమిటీ పెద్దలు వేలం నిర్వహించారు. లడ్డూ ప్రసాదాన్ని వేలం నిర్వహించగా భారత్‌గ్యాస్ యజమాని మల్లికార్జునరెడ్డి రూ.1.10 లక్షలకు లడ్డూ ప్రసాదాన్ని కైవశం చేసుకున్నారు. అదేవిధంగా వ్యాపారవేత్త శ్రీకాంత్‌రెడ్డి రూ.90 వేలకు హుండీని దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవకమిటీ సభ్యులు బసవన్న గౌడ్, హెగ్గటి ప్రసాద్, చంద్రకాంత్‌రెడ్డి, దేవిశెట్టి ప్రకాష్, ఎండీ బసవరాజు, మారుతిరావు, కునిగిరి నీలకంఠ తదితరులు పాల్గొన్నారు. ప్రారంభమైన నిమజ్జనోత్సవంలో మేళతాళాలు, బ్యాండు భజంత్రీలకు అనుగుణంగా ఎమ్మెల్యే తనయుడు, వవీఎచ్‌పీ నాయకులు పట్టణ ప్రముఖులు, ఆధ్యాత్మిక ఆనందంతో నృత్యం చేస్తూ ఊరేగింపుకు అగ్రభాగాన కొనసాగారు. చిన్నహరివాణం సమీపంలోని తుంగభద్ర దిగువ కాలువ వద్ద ఏర్పాటు చేసిన వినాయకఘాట్‌లో సంప్రదాయబద్ధంగా సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, తమసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీఓ గీతావాణి, ఎమ్మెల్యే తనయుడు జయమనోజ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, ఉత్సవకమిటీ సభ్యులు పూజలు నిర్వహించి నిమజ్జనోత్సవానికి అంకురార్పణ చేశారు. సాయంత్రం 5 గంటల నుంచి పట్టణంలోని ఆయా వీధుల్లో కొలువుదీరిన 500కు పైగా గణపయ్యలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం నిమజ్జనోత్సవాలకు శ్రీకారం చుట్టారు. శుభ ముహూర్తం కోసం మండప నిర్వాహకులు చాలామంది సాయంత్రం నిమజ్జనోత్సవ ఊరేగింపున్పురరారంభించారు. దీంతో విగ్రహాల ఊరేగింపు పాత బస్టాండు కూడలి చేరుకోవడానికి రాత్రి 8 గంటలు పట్టింది. ఊరేగింపు ద్వారా ఒకే చోటుకు చేరుకోవడంతో పాత బస్టాండు కూడలి భక్తజన సంద్రంగా మారింది.

**– ఉత్సవం... భక్తి కలగలిసి..**

నిమజ్జనోత్సవంలో భక్తి ఉత్సాహం పెరిగింది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు లింగబేధం లేకుండా మేళతాళాలు, డోలు శబ్దాలు, డీజేలకు అనుగుణంగా ఆధ్యాత్మిక ఆనందంతో మైమరిచి నృత్యం చేశారు. ప్రత్యేక మండపాల్లో ఐదు రోజులపాటు పూజలందుకున్న తమ ఇలవేల్పును భక్తులు ఆనందంగా సాగనంపారు. బాణసంచా పెద్ద ఎత్తున పేల్చారు. పరస్పరం రంగులు పూస్తూ ఆనందం పంచుకున్నారు. పాటలు పాడుతూ భజన చేస్తూ జయజయకారాలు పల్లిస్తూ మరి కొంతమంది కాషాయి వస్త్రాలు ధరించి తమ గణపయ్యకు వీడ్కోలు పలికారు. ఊరేగింపు, నిమజ్జనోత్సవంలో ఎక్కువశాతం బాలికలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

**– దాహార్తి తీర్చిన దాతలు**

వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఫోటో స్టూడియో నిర్వాహకులు, జిల్లా జంగమ సంఘం సభ్యులు దాహార్తి తీర్చేందుకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. అంతేగాకుండా పులిమోర, చిత్రన్నం, షరబత్, వగ్గని బజ్జీలు, ఉప్మ కూడా పంపిణీ చేశారు.

**– భారీ బందోబస్తు**

పట్టణం సున్నిత, సమస్యాత్మక ప్రాంతం కావడంతో ఉత్సవాలకు జిల్లా ఎస్పీ క్రిష్ణకాంత్ ఆదేశాల మేరకు డీయస్పీ శివనారాయణస్వామి ఆధ్వర్యంలో 600 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. అధికారులు, సిబ్బందికి తగిన సూచనలు చేశారు.

**– రోడ్డు దిగ్భందనం**

నిమజ్జనోత్సవం సందర్భంగా పోలీసులు పట్టణంలోని పలు రోడ్లు, బారికెడ్లతో దిగ్భందించారు. పల్లె నుంచి రాకపోకలు సాగించే ఆటోలను పట్టణం బయట నిలిపివేశారు. బస్సులు, లారీలను కూడా అనుమతించలేదు. నిమజ్జనోత్సవాలు కొనసాగే రోడ్లను పూర్తిగా తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు.

**– క్రేన్ ద్వారా వినాయక విగ్రహాల నిమజ్జనం**

చిన్నహరివాణం ఎల్లెల్సీ కాలువ వద్ద క్రేన్‌ల ద్వారా వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు.

**– బందోబస్తును పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ**

ఆదోని పట్టణంలో జరుగుతున్న వినాయక నిమజ్జనోత్సవ ఏర్పాట్లను జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ దగ్గరుండి బందోబస్తును పర్యవేక్షించారు. పోలీసు సిబ్బందికి పలు సూచనలు, సలహాలు తెలియజేశారు. అనంతరం చిన్నహరివాణం ఎల్లెల్సీ కాలువ వద్దకు చేరుకుని వినాయకుల నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అక్కడి బందోబస్తులో ఉన్న సిబ్బందిని ఆదేశించారు.

## అపర భగీరథుడు చంద్రబాబు అరెస్టు అక్రమం..!

**– తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి సాయిబాబా, టిడిపి ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు**



**ఆదోని, సెప్టెంబరు 22, ప్రభాతవార్త :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, నవ్యాంధ్రప్రదేశ్‌లోను రైతులకు సాగునీరు అందించేందుకు గోదావరి జిల్లాలను కృష్ణా జలాలకు అనుసంధానం చేసి రైతులకు అందించిన అపర భగీరథుడు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అరెస్టు అక్రమం అని తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి సాయిబాబా, టిడిపి ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడులు అన్నారు. శుక్రవారం తెదేపా నాయకులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 10వ రోజుకు చేరుకున్నాయి. తెదేపా జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ పట్టణంలోని ఎన్‌టిఆర్ విగ్రహం దగ్గర అరెస్టుకు నిరసనగా దీక్షలు చేస్తున్న వారికి తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి సాయిబాబా సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నాంది పలికారన్నారు. అలాగే తెలంగాణలోని 7మండలాలను మన రాష్ట్రంలో విలీనం చేయించి నిర్మాణానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా ముందుజాగ్రత్త చర్యగా కృషి చేశారన్నారు. తమిళనాడు సరిహద్దు చిత్తూరు జిల్లాలోని అనేక ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. కోర్టులో జరిగిన వాదోపవాదనలు ప్రపంచం మొత్తం చూసిందని చంద్రబాబు రిమాండ్ ఎంత అక్రమమో ప్రజలకు అర్థమైందన్నారు. తప్పుడు కేసులు చేసిన వారు తప్పకుండ మూల్యం చెల్లించుకుంటారన్నారు. రాష్ట్రంలోనే కాకుండ దేశంలోనూ, ప్రపంచంలోనూ చంద్రబాబు అరెస్టును ఖండిస్తున్నారన్నారు. సైకో జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించేవరకు ప్రజలతో కలిసి పోరాటం చేస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఘనవిజయం సాధించడం ఖాయమని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకులు ఉమాపతినాయుడు, జిల్లా పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి భూపాల్‌చౌదరితో పాటు నందమూరి అభిమానులు, తెదేపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బాలకృష్ణపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే సహించం

**పత్తికొండ, సెప్టెంబరు 22, ప్రభాతవార్త**

హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని బాలకృష్ణ ఫ్యాన్స్ టౌన్ అధ్యక్షుడు సింగం శ్రీనివాసులు, సోమ్లు నాయక్, తిరంగలు అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ నందమూరి బాలకృష్ణను అసెంబ్లీలో అంబటి రాంబాబు ఇష్టానుసారంగా మాట్లాడడం సరైంది కాదన్నారు. అంబటి రాంబాబు నోరు జాగ్రత్త పెట్టుకోవాలని లేకుంటే పుట్టగతులుండవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మీరా హుస్సేన్, రాహంతుల్లా, చంద్రశేఖర్, రామాంజనేయులు, అనిల్ తదితరులున్నారు.

## 'పేదలకు అండగా వైఎస్‌అర్ భీమా

**– జడ్పీచైర్మేన్ ఎర్రబోతుల'**



**కొలిమిగుండ్ల, సెప్టెంబరు 22, ప్రభాతవార్త :** వైసీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్‌అర్ భీబా పథకం పేద ప్రజలకు ఎంతగానో అండగా నిలుస్తోందని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మేన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పెర్కొన్నారు. శుక్రవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో మండలంలోని ఉమ్మయిపల్లె గ్రామంలో చందూనాయక్ కుటుంబానికి మంజూరైన రూ.5లక్షల వైఎస్‌అర్ భీమా చెక్కును వారికి అందజేశారు. గత జులై నెలలో చందూనాయక్ ఇంటి పనులు చేసుకుంటూ వుండగా ఇంటి పైకప్పు కూలి ఆకస్మాత్తు మృతి చెందాడు. దీంతో జడ్పీచైర్మేన్ ఎర్రబోతుల ఎమ్మెల్యే కాటసాని ప్రత్యేక చొరవతో ఆకుటుంబానికి వైఎస్‌అర్ భీమా కింద రూ.5లక్షలు మంజూరైంది. దీంతో మృతుడు చందూనాయక్ భార్య లక్ష్మీదేవికి ఈ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ అంబటి గుర్విరెడ్డి, పేరం సత్యనారాయణరెడ్డి, తోళ్లమడుగు సర్పంచ్ మొలక రాజారెడ్డి, ఉమ్మాయిపల్లె సర్పంచ్ ఎస్.లక్ష్మీదేవి, కామిని తిమ్మారెడ్డి, గోపాల్‌రెడ్డి, కొలట్టం సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**చెరువులో పూజలు నిర్వహించిన జడ్పీచైర్మేన్ :** మండలకేంద్రమైన కొలిమిగుండ్ల సమీపంలోని నాయినిపల్లె రహదారిలో గల సద్దలవెంగన్న చెరువులో ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మేన్ ఎర్రబోతుల పాపిరెడ్డి శుక్రవారం పూజలు నిర్వహించారు. గత రాత్రి కురిసిన ఓమోస్తారు వర్షంతో సద్దల వెంగన్న చెరువుకు వరద నీరు వచ్చి నిండిపోయింది. చెరువు పూర్తిగా నిండి అలుగుపై ప్రవహిస్తుండడంతో జడ్పీచైర్మేన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మండల కన్వీనర్ అంబటి గుర్విరెడ్డి తదితరులు చెరువు వద్దకు చేరుకొని గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## వర్షం రాకతో రైతులు హర్షం

**– పొలం పనుల్లో బిజీబిజీ**

**పగిడ్యాల, సెప్టంబరు 22, ప్రభాతవార్త :** వర్షంరాకతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పగిడ్యాల మండలంలో శుక్రవారం తెల్లవారుఝామున వర్షం కురువడంతో రైతులు వ్యవసాయ కూలీలు తెల్లవారంగనే పొలం పనుల్లో బిజీబిజీ అయ్యారు. వ్యవసాయ బావుల కింద పటలను సాగుచేసిన రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్న నేపథ్యంలో వర్షం పడటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పగిడ్యాల మండలంలో 40.06 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూఅధికారులు తెలిపారు. వర్షం పడటం వల్ల వ్యవసాయ బావుల కింద ఉల్లి, పండుమిర్చి, మిరప, పొగాకు నాటుతున్నారు. ఈ వర్షం పడటం వల్ల పంటలకు ఎంతో ఉపయోగకరంగా వుందనీ రైతులు తెలిపారు.

## అనాధ బాలలకు అండగా ఉందాం

**నంద్యాల సిటి , సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** అనాధ బాలలకు సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరు అండగా నిలబడాలని పట్టణంలోని 38వ వార్డుకు చెందిన టిడిపి నాయకుడు తాటికొండ బుగ్గరాముడు తెలిపారు. ఇక్కడున్న నేతాజి సుభాష్ చంద్రబోష్ అనాధ విద్యార్థుల పాఠశాలలో అన్నదాన వితరణ కార్యక్రమం చేపట్టారు. కాలనీకి చెందిన టిడిపికి చెందిన తాటికొండ బుగ్గరాముడు మనవరాలు హేమాత్రి పుట్టిరోజు సందర్భంగా ఈకార్యక్రమం చేపట్టారు. పాఠశాలలోని అనాధ విద్యార్థుల మధ్య తన మనువరాలి వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. పాఠశాల అభివృద్ధికి అనాధ బాలలకు చేయూతనందించడానికి తనవంతు అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు

**– ఏడిప మహమ్మద్ ఖాద్రి**

**మాధవరం(మంత్రాలయం), సెప్టెంబర్ 22, ప్రభాతవార్త:** మండలంలోని ఎరువల డీలర్లు రైతులకు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవనిఏడిప మహమ్మద్ ఖాద్రి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మాధవరం, తుంగభద్ర గ్రామాల్లో ఉన్న ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. తుంగభద్రలోని భీమ ట్రేడర్స్, సిద్ధివినాయక, శ్రీరామ్ ట్రేడర్స్ దుకాణాలు అదేవిధంగా మాధవరంలో ఉన్న మారుతి ట్రేడర్స్, పంచముఖి ట్రేడర్స్ దుకాణాలను తనిఖీచేశారు. ఇందులో ఉన్న ఎరువల స్టాకును పరిశీలించారు. ఎరువుల స్టాకు రిజిస్టర్‌ను తనిఖీ చేసి ఎరువుల ధరల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎరువుల వివరాలను ఎప్పటికప్పుడు ఈ పాస్ మిషన్‌లో ఆన్‌లైన్ చేయాలన్నారు. ఈ పాస్ మిషన్‌లో అప్‌డేట్ చేయకపోతే వారి లైసెన్సులు రద్దుచేస్తామని హెచ్చరించారు. అనంతరం క్రిమి సంహారక మందుల షాంపుల్స్‌ను తీసుకున్నారు. వీరివెంట ఏఓ జీరా గణేష్, ఏఈఓ నరసింహుడు తదితరులు ఉన్నారు.

## క్రీడలు యువతలో ఆత్మస్థైర్యం, ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయి

**నంద్యాల హాస్పటల్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** నేటి యువత చదువుతో పాటు క్రీడల పట్ల అసక్తి పెంచుకోవాలని క్రీడలు యువతలో ఆత్మవిశ్వాసం, శారీరక ధారుఢ్యం, ఆత్మస్థైర్యం పెంపొందిస్తాయని స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి పద్మావతీ, ఐఎంఏ రాష్ట్రశాఖ అధ్యక్షులు డా.రవికృష్ణలు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎస్పీజీ మైదానంలో హాకీబేస్‌బాల్ బాలబాలిక జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ఎంపిక కావడానికి ఈ జిల్లా పోటీలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఇలాంటి పోటీలు నిర్వహించడంతో వారి ప్రతిభను వెలుగులోకి వస్తుందన్నారు. పోటీలలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మహేశ్వర్‌రావు, సుబ్బయ్య, రమణ, సుదర్శన్, ఎస్పీజీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

## జిపిఎస్, సిపిఎస్‌లను రద్దు చేయాలి

**దేవనకొండ, సెప్టెంబరు 22, ప్రభాతవార్త**

ప్రభుత్వం తక్షణమే జిపిఎస్, సిపిఎస్‌లను రద్దు చేయాలని డిటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి రోషన్న డిమాండ్ చేశారు. రాష్ట్ర కేబినెట్ కమిటీ సిపిఎస్‌కు బదులుగా జిపిఎస్‌ను అమలు చేయాలని నిర్ణయం తీసుకోవడంతో ఆ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఫ్యాప్టో పిలుపుమేరకు శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శన చేశారు. డిటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రోషన్న సమస్యలను గురించి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ పథకం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, భోదనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనంకు..పకడ్బందీగా ఏర్పాట్లు చేయండి

(తరువాయి) కలెక్టర్ పోలీస్ అధికారులకు సూచించారు. నిర్దేశించుకున్న రూట్ మ్యాప్ ఉల్లంఘించకుండా చూడాలని సూచించారు.. ముందుగా ఏ విగ్రహం వెళ్తే ఆ విగ్రహమే నిమజ్జనం జరగాలని, ప్రతి క్రేన్ దగర పోలీస్ అధికారులను పెట్టి, ఎలాంటి శాంతి భద్రతల సమస్య రాకుండా చూసుకోవాలని అదనపు ఎస్పీ కి సూచించారు. ఈ నెల 25 వ తేదీ ఉదయం లోపు బ్యారికేడింగ్ పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. ఓల్డ్ బస్టాండ్ నుండి వినాయక ఘాట్ ప్రాంతం వరకు ప్రతి అర్థ కిలోమీటర్ కు ఒక బేసిక్ ఫస్ట్ ఎయిడ్ తో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, 108 తో పాటు2 అంబులెన్స్ లు ఏర్పాటు చేయాలని , వీటిని ఏ ఏ ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు అందరికీ తెలిసేలా అవగాహన కల్పించాలన్నారు. మత్స్య శాఖకు సంబంధించి గజ ఈతగాళ్ళను, లైఫ్ జాకెట్ లను ఘాట్ వద్ద ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా మత్స్య శాఖ అధికారిని అదేశించారు. సమావేశంలో డిఆర్‌ఓ మధుసూదన్ రావు, వివిధ శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు కృష్ణన్న, నగర అధ్యక్షుడు డా.మోక్షేశ్వరుడు, ఉపాధ్యక్షుడు హరీష్, జిల్లా సమన్వయ కార్యదర్శి నాగఫణి వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్, కోశాధికారి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## జగనన్నకు చెబుదాంకు అరకొరగా ధరఖాస్తులు..!

**(తరువాయి)** ఉన్నతాధికారులంతా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి కోడుమూరు జడ్పీటీసీ సభ్యుడు బరుసు రఘునాథ్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సమావేశం దాదాపు మూడు గంటల పాటు సాగిన ఈ స్పందన కార్యక్రమానికి ఆయా గ్రామాల నుంచి కేవలం ప్రజల నుంచి 61 మాత్రమే ధరఖాస్తులు రావడం గమనార్హం. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గత రెండు రోజుల నుంచి స్థానిక అధికారులు విస్తృతంగా ప్రచారాలు చేసిన ఆశించిన మేరకు ప్రజల నుంచి వినతులను రాబట్టలేకపోయ్యారు. దీంతో వచ్చిన వారి దగ్గర నుంచే జిల్లా కలెక్టర్ వినతులను స్వీకరించారు. వీటిలో అధిక శాతం ఫించన్ల కోసం ధరఖాస్తు చేసుకున్నారు. మరి కొంత మంది ఇళ్ల మంజూరు, బిల్లులు విడుదల చేయాలని, మండలంలోని పులకుర్తి గ్రామంలో సరస్వతమ్మకు చెందిన మూడు ఎకరాల భూమిని స్వంత బావ లాక్కొన్నాడని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. ఆయా గ్రామాల రైతులు రబీ సీజన్‌లో సబ్సిడీపై శనగ విత్తనాలను పంపిణీ చేయాలని కోరారు.

**దిగువ కాలువలకు నీరు రావడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు :** తుంగభద్ర దిగువ కాలువ కోడుమూరు సబ్‌డివిజన్‌లో ఉన్న ఆయకట్టు భూములకు సాగు నీరు అందించడంతో ఇక్కడి నీటి పారుదల అధికారులు ఘోరంగా విఫలమయ్యారని రైతులు కలెక్టర్‌తో మోరపెట్టుకున్నారు. ఈ విషయంపై స్పందించిన కలెక్టర్ వెంటనే స్పందించి సంబంధిత నీటి పారుదల అధికారులతో మాట్లాడారు. సాగు నీటి విషయంలో అధికారులు ఎన్ని ఎకరాలకు నీటిని అందిస్తారో ఆ విషయాలను రైతులకు చెప్పి సాగు చేయించాలన్నారు. ఈ విషయంపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా హౌసింగ్ పిడి సిద్దలింగమూర్తి, డిపివో నాగరాజు నాయుడు, పి.ఆర్ ఎస్.ఇ సుబ్రమణ్యం, డిఆర్‌డివో అసిస్టెంట్ పి.డి శివలీల, పశువైద్యాశాఖ జె.డి కె.రామచంద్రయ్య, మైనార్టీ అడిషనల్ పి.డి సలీమ్‌భాష, మత్స్యశాఖ జె.డి శ్యామల, ఆర్‌డబ్ల్యుఎస్ ఇ.ఇ నాగేశ్వరరావు, అగ్రికల్చర్ జె.డి ఎస్.సాలురెడ్డి, ఛీఫ్ ప్లానింగ్ అధికారి అప్పలకొండ, కర్నూలు ఆర్డీవో హరిప్రసాద్, షెరికల్చర్ హరిక్రిష్ణ, స్థానిక ఎంపిడివో చంద్రశేఖర్, తాహాశీల్దార్ జయ్యన్న, వ్యవసాయ అధికారి రవిప్రకాష్, ఆయా గ్రామాల విఆర్వోలు ఎల్లప్ప, నారాయణ, పంచాయితీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## నిరుపయోగంగా మారిన ఆర్‌ఓప్లాంట్

**– వృధా అవుతున్న ప్రభుత్వ నిధులు – నాడు-నేడు నిధులు స్వాహా – పట్టించుకోని అధికారులు**

**రచ్చుమర్రి(మంత్రాలయం), సెప్టెంబర్ 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందిం చాలన్న సదుద్దేశంతో ప్రభుత్వం నాడు-నేడు పనులను ప్రారంభించి రూ.కోట్ల నిధులను ఖర్చుచేస్తోంది. ఈ పనుల్లో భాగంగా పాఠశాలల్లో మౌళిక సదుపాయాలు కల్పించడంతో పాటు అదనపు గదులు నిర్మించి విద్యను అందిస్తోంది. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా నాడు-నేడు పనుల లక్ష్యం నీరుగారిపోతోంది. వివరాల మేరకు మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్‌ఓప్లాంట్ నిరుపయోగంగా మారి ంది. రూ.వేలాది వెచ్చించి ఆర్‌ఓప్లాంట్‌ను ప్రభుత్వం కొనుగోలు చేస్తే తీరా అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆర్‌ఓప్లాంట్ మూలనపడి ఎవరికి ఉపయోగం లేకుండా అయ్యింది. తద్వారా విధ్యార్థినీ, విధ్యార్థులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌ఓప్లాంట్ పనిచేయాలంటే విద్యుత్ సౌకర్యం లేదని అందుకుగాను ఆర్‌ఓప్లాంట్ నిరుపయోగం అయ్యిందని పాఠశాల ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. అయితే విద్యుత్ శాఖ అధికారులు పాఠశాలకు ప్రత్యేకంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అమర్చినట్లు గ్రామ ప్రజలు తెలిపారు. కేవలం అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఆర్‌ఓప్లాంట్ నిరుపయోగంగా మారిందని విధ్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. నాడు-నేడు పనుల్లో ప్రభుత్వం విడుదల చేసిన నిధులను అధికారులే పర్సంటేజీల రూపంలో నొక్కేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. విధ్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించాల్సిన అధికారులు అసలు పట్టించుకోవడం మానేసినట్లు గ్రామ ప్రజలు తెలియజేశారు. పాఠశాలలో తాగునీటి సౌకర్యం లేకపోవడంతో విధ్యార్థులు రోడ్లపై ఉన్న పబ్లిక్ కుళాయిల నీటిని తాగి దాహం తీర్చుకుంటున్నారు. పాఠశాలలో తాగునీటి సమస్య పరిష్కరించాలనిస్థానిక నాయకులకు చెప్పినా పట్టించుకోవడం లేదని తెలిసింది. కాబట్టి ఇప్పటికైనా అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న ఆర్‌ఓప్లాంట్‌ను వినియోగంలోకి తెచ్చి విధ్యార్థుల దాహం తీర్చాలని విధ్యార్థుల తలిదండ్రులు కోరతున్నారు.

## పోటాపోటీగా లడ్డు వేలం పాటలు

**నంద్యాల సిటి, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** నంద్యాల పట్టణంలో శుక్రవారం నిర్వహించిన గణేష్‌నిమ్మజ్జన కార్యక్రమంలో నిర్వహించిన లడ్డు వేలం పాటలు పోటా పోటీగా సాగాయి. ఇందులో భాగంగా ఎన్‌జిఓ కాలనీలో, హౌసింగ్‌బోర్డు కాలనీలో ఎంఐజి-2లో ఏర్పాటు చేసిన వినాయకుని మండపం వద్ద వేలం పాటలు అసక్తికరంగా జరిగాయి. భక్తులు దేవుని వద్ద ఉంచిన లడ్డును దక్కించుకోవడానికి వేలం పాటలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈక్రమంలో కమిటీ సభ్యులు నిర్వహించిన వేలం పాటలు శ్రీనివాసులు అనే వ్యాపారి అత్యధికంగా రూ.81 వేలకు పాటపాడి దక్కించుకున్నారు. ఇక్కడ గతంలో వేలం పాట ద్వారా వినాయకుని లడ్డును దక్కించుకున్న భక్తులు ఎనో న్నరకాలుగా మంచిజరగడంతోనే పోటీ జరిగిందని కమిటీ సభ్యులు గోవిందరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసరావు, వెంకటసుబ్బయ్య, రాంప్రసాద్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, రమణారెడ్డి తెలిపారు..

## రాజకీయ కక్షతోనే చంద్రబాబు అరెస్టు

**మంత్రాలయం, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త:** రాజకీయ కక్షతోనే టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసినట్లు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మంత్రాలయంలో చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండిస్తూ చేపట్టిన రిలేనిరాహార దీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ కోసిగి మండలం క్లస్టర్, యూనిట్, బూత్ ఇంఛార్జ్‌ల ఆధ్వర్యంలో ఈ నిరాహారదీక్షలు చేపట్టినట్లు తెలిపారు. చంంద్రబాబుపై వైసిపి నాయకులు ఎన్ని కుట్రలు చేసినా కడిగిన ముత్యంలా బయటకు వస్తారని చెప్పారు. చంద్రబాబు సేవలు రాష్ట్రానికి చాలా అవసరమని కావున రాబోయే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిగా ఎన్నుకొని రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జ్ఞానేష్, భరద్వాజ్‌శెట్టి, కృష్ణారెడ్డి, శివ, రామచంద్ర, అశోక్‌రెడ్డి, విజయరామిరెడ్డి, ఎల్లారెడ్డి, చావడి వెంకటేష్, అమర్‌నాథ్‌రెడ్డి, అబ్దుల్, వట్టెప్ప నరసింహులు, మారెప్ప, యోబు తదితరులు పాల్గొన్నారు.

## హక్కులను హరించే విదంగా చైర్మన్ వ్యవహరిస్తున్నారు

**కర్నూలు న్యూసిటి, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినందున వారిపై పెట్టిన కేసులు వాపస్ తీసుకొని జరిగిన సంఘటనపై ముఖ్యమంత్రి క్షమాపణ చెపాలని, శాసన మండలి రూల్ నం.341 కింద చర్చకు అనుమతించాలని కోరగా శాసన మండలి చైర్మన్ తిరస్కరించారు. ఇందుకు తెలుగుదేశం పార్టీకి చెందిన మండలి సభ్యులు మండలి చైర్మన్ పోడియం వద్దకు వెళ్లి దిగ్బందం చేసి చర్చకు పట్టుబట్టడంతో చైరమ్న్‌సభను మూడుసార్లు వాయిదా వేశారని టిడిపి మండలి ఉపనాయకులు బిటి నాయుడు తెలిపారు. తదుపరి మండలి సమావేశం కాగ ఇదే అంశంపై చర్చకు పట్టుబట్టడంతో అధికార వైసీపీ సభ్యులు అడ్డుకునేందుకు ప్రయత్నించగా మండలిలో టిడిపి ఉపనాయకుడు బిటి నాయుడు, ఇతర టిడిపి సభ్యులు వారిని అడ్డుకోవడం జరిగింది. విధిలేని పరిస్థితుల్లో మండలి చైర్మన్ బిటి నాయుడుతో పాటు కంచర్ల శ్రీకాంత్, పంచుమర్తి అనురాధలను సమావేశం ముగిసేవరకు సస్పెండ్ చేశారు. దీంతో పోడియం వద్ద బైటాయించగా భారీ సంఖ్యలో మార్షల్స్‌ను సభలోకి పిలిపించి బలవంతంగా బయటకు తీసుకువెళ్లెలా అదేశించారని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పెద్దల సభలో సభ్యుల హక్కులను హరించేవిధంగా చైర్మన్ వ్యవహరిస్తున్నారని బిటి నాయుడు ధ్వజమెత్తారు. ఈఅంశంపై చర్చకు అనుమతించేవరకు వదలిపెట్టె ప్రసక్తిలేదని బిటి నాయుడు తెలిపారు.

## మహిళాపై అత్యాచారయత్నం

**కొత్తపల్లి, సెప్టెంబర్22, ప్రభాతవార్త ;** మండలం లోని ఎదురుపాడు గ్రామంలో ఓ మహిళపై ఓ వ్యక్తి గురువారం రాత్రి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. పోలీస్ లు తెలిపిన వివరాల ప్రకారం ఎదురుపాడు గ్రామానికి చెందిన 45 సంవత్సరాల వయస్సుగల ఓ ఒంటరి మహిళ తన ఇంట్లో నిద్రిస్తుండగా గురువారం అదే గ్రామానికి చెందిన 44 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి ఆమెను పట్టుకునేందుకు ప్రయత్నించగా ఆ మహిళ వెంటనే నిద్రలేచి అతన్ని నెట్టి ఆమే కేకలు వేయడంతో పక్కింటివారు అక్కడికి రావడంతో అ వ్యక్తి పరారయ్యాడని బాధితురాలు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసునమోదు చెసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

## రక్తదానం చేయండి.. ప్రాణాలను కాపాడండి...

**ఆత్మకూరు సెప్టెంబర్22, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదాలు, ఇతర ఆరోగ్య జాగ్రత్తలతో ఇబ్బంది పడుతూ ఎంతో మందికి సరైన సమయంలో రక్తం అందక ప్రాణాలు పోయిన సంఘటనలు చోటు చేసుకుంటున్నప్పటికి రక్తదానం చేయండి ప్రాణాలను కాపాడుకోండి అంటూ ఆత్మకూరు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాయుడు శుక్రవారం కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్యాధికారి మాట్లాడుతూ 18 సంవత్సరాల నుంచి 65 సంవత్సరాల లోపు ఉన్న వారు రక్తదానం చేయవచ్చని తెలిపారు. మహిళల ప్రసవ సమయంలో సర్జరి సమయాలలో అదికంగా రక్తం ఉపయోగ పడుతుందని తెలిపారు. బరువు తగ్గడంలో సహాయ పడుతుందన్నారు. రోగ నిరోదక శక్తిని పెంచుతూ గుండె జబ్బుల ప్రమాదం తగ్గిస్తుందని తెలియజేశారు. ప్రాణాల కోసం విద్యార్థులు, సేవకులు, స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తంలేని వారికి సహాయం చేసే విదంగా నేటి యువతరం ముందుండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిని స్పల్ వెంకటనర్సయ్య, టిబి సూపర్‌వైజర్ చెరుకు రవికుమార్, బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ ప్రసాద్, సీనియర అద్యాపకులు పద్మావతి, విద్యాసాగర్, చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ క్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## పత్తికొండలు ప్రబలుతున్న విషజ్వరాలు

**పత్తికొండ, సెప్టెంబర్22, ప్రభాతవార్త:** పత్తికొండ పట్టణంలో డ్రైనెజీ కాలువల్లో దోమల నివారణ మందు స్ప్రే చేయకపోవడంతో ప్రజలు విషజ్వరాల బారినపడుతున్నారు. ప్రతి ఇంటిలో ముగ్గురు నలుగురు విషజ్వరాలతో బాధపడుతూ ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణంలో డ్రైనెజీ కాలువల్లో మురికి నీరు నిలిచిపోయి తద్వారా దోమలు ఎక్కువవుతున్నాయని కాలువల్లో దోమల నివారణ మందు స్ప్రే చేయకపోవడం వల్ల దోమలు అధికమవుతూన్నయని ప్రజలు ఆరోపిస్తున్నారు. విషజ్వరాల బారిన పడిన ప్రజలు ప్రైవేట్ క్లినిక్‌లను ఆశ్రయిస్తుడడంతో వారి జేబులకు చిల్లు పడుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. పట్టణంలోని గ్రామ పంచాయతీ అధికారులు కూడా సందుల్లో, వీధుల్లో ఉన్న డ్రైనెజీ కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా కాలువల్లో దోమల నివారణ మందు స్ప్రే చేయించలేకపోతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీని పై మేజర్ గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం మాత్రం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే వైద్యం అందిస్తామని చెప్పడం మాటలకే పరిమితమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దోమలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## గ్రామీణ ప్రాంత విద్యార్థుల ప్రతిభను వెలికితీయాలి

**బేతంచెర్ల, సెప్టెంబర్22, ప్రభాతవార్త:**

గ్రామీణ ప్రాంతాల్లో బాలబాలికల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలని ఎంపిపి బుగ్గన నాగభూషణంరెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలంరెడ్డిలు వ్యాయామ ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం స్థానిక జెడ్పీహెచ్ఎస్ శేషారెడ్డి ఉన్నత పాఠశాల యందు జరిగిన డివిజన్ స్థాయి అండర్-14, అండర్-17 టోర్నమెంట్ సెలక్షన్ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. డివిజన్‌స్థాయి టోర్నమెంట్ కం సెలక్షన్ కార్యక్రమానికి కో ఆర్డినేటర్ అయిన సుధాకర్ ఆధ్వర్యంలో హెచ్ఎం అబ్రహాం, ఎంఈవో సోమశేఖర్‌లు ముఖ్య అతిథులతో కలిసి క్రీడలను ప్రారంభించారు. ఇందులో 9 క్రీడాంశాలకు సంబంధించి బాలబాలికలు తీవ్రంగా పోటీపడ్డారు. ఆయా క్రీడాంశాలకు జిల్లాస్థాయి జట్లను న్యాయనిర్ణేతలు ఎంపిక చేయడం జరిగింది. స్థానిక జెడ్పీహెచ్ఎస్ శేషారెడ్డి హైస్కూల్ నందు 9వ తరగతి చదువుతన్న సాయిదేవి అనే బాలిక, 6వ తరగతి చదువుతున్న పూజితలు వారి నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో న్యాయనిర్ణేతలుగా వెంకట్‌నాయక్, రంగనాయకులు, ఇతర పీఈటీలు పాల్గొన్నారు.

## విగ్రహాలను నిమజ్జనానికి అన్ని ఏర్నాట్లు

**కోవెలకుంట్ల, సెప్టెంబరు 22, ప్రభాతవార్త**

పట్టణంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను కుందూలో నిమజ్జనము చేయడానికి అన్ని ఏర్పానట్లు పూర్తి చేశామని శుక్రవారము ఉదయం తహశీలుదారు పుష్పకుమారి చెప్పారు. వినాయక నిమజ్జనము కుందూలో చేయాల్సి ఉండగా జిల్లా కలెక్టరు మనజీర జిలాని అదేశాల మేరకు తహశీలుదారు పర్యవేక్షించారు. ఈమె వెంట విఅర్ఓలు చెన్నయ్య, పుల్లయ్య సీనియర్ అసిస్టెంట్ తదితరులు ఉన్నారు.

## అమరావతి అసెంబ్లీ హాల్‌లో సిఎంను కలిసిన పత్తికొండ ఎమ్మెల్యే

**– ఆ గ్రామానికి రోడ్డుసౌకర్యం కల్పిస్తామని ఎమ్మెల్యే శ్రీదేవికి హామీ ఇచ్చిన సిఎం..**

**వెల్దుర్తి, సెప్టెంబర్22, ప్రభాతవార్త :**



మండలంలోని చిన్నకొలుముల పల్లి ప్రజలకు సిఎం హామీతో కల తీరనున్నదని పత్తికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. ఇటీవల ఆ గ్రామానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వెళ్లిన పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి ముందు గర్భిణీలు, మహిళలు ఆరోగ్య సమస్యలు వస్తే తమ గ్రామానికి సరైన రోడ్డు లేదని విన్నవించారు. గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీదేవి అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా అక్కడకు వెళ్లిన ఆమె అమరావతిలోని వెలగపూడి అసెంబ్లీహాల్ నందు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా నమస్కరించి గ్రామస్తుల మొరను వినిపించారు. వారి సమస్యలను ఆమె సిఎం జగనన్నకు వివరించారు. దీంతో స్పందించిన సిఎం జగనన్న త్వరలోనే ఆ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే శ్రీదేవి తెలిపారు.

## సమయపాలన పాటించాలి

**చాగలమర్రి, సెప్టెంబర్22, ప్రభాతవార్త:** సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపిడివో మహబూబ్ దౌలా కోరారు. శుక్రవారం మండలంలోని శెట్టివీడు సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి వివిధ రకాల రికార్డులను పరిశీలించారు. సచివాలయానికి వచ్చే వారికి అందుబాటులో ఉండాలని, వచ్చిన వారితో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని ఎంపిడివో సూచించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఏఈ కొండారెడ్డి, పంచాయతీ కార్యదర్శి స్వప్న, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా స్థాయికి ఎంపికైన కోవెలకుంట్ల ప్రభుత్వం పాఠశాల విద్యార్థులు

**కోవెలకుంట్ల, సెప్టెంబరు 22, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్కూలు క్రీడల్లో బాగంగా నిర్వహించిన నియోజక వర్గ సాయి పోటీల్లో విజయం సాదించి కోవెలకుంట్ల ప్రభుత్వం ఉన్న పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ప్రదానోపాద్యాయులు రిజయ్య చెప్పారు. శుక్రవారము అయన పాఠశాల్లో విలేకర్లతో మాట్లాడుతూ నియోజక వర్గ సాయిలో ప్రభుత్వం పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి జిల్లా స్థాయికి ఎంపికైనారని చెప్పారు. అందుఎలో బాగంగా అండర్ 17విభాగములో కబ్బడీ పోటీల్లో మహేంద్ర, అండర్ 14లోవిభాగములో జగన్, తరుణ్, నరేష్, మొదలైన విద్యార్థులు ప్రతిభ కనబరచి జిల్లా స్థాయికి ఎంపికైనారని చెప్పారు. అండర్ 17 త్రో బాల్‌లో జగదీస్, జయచంద్రలు యోగా లోనరసింహత్యేజ, సుంకిరెడ్డిఅండర్ 14విభాగములో జగన్ అండర్ 17టెన్నీకాయిట్‌లో సురేంద్రబాబు, రంజిత్‌కుమారు, ప్రభాష్, దినేష్‌లు అండర్ 14లో అబ్దుల్ రజాక్, షంషీరు అలాగే బ్యాడ్మింటన్‌లో మొయినాలి ఎంపిక అయ్యారని చెప్పారు. వీరందని అబినందించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగశేషుడు, డ్రిల్ మాస్టరు వెంకటేశ్వరరెడ్డి, సుగుణ, జహిరాబిలు పాల్గొన్నారు.

## బొజ్జ గణపయ్యా...సెలవయ్యా



**జూపాడుబంగ్లా, సెప్టంబర్ 22, ప్రభాతవార్త :** ఐదు రోజుల పాటు పూజలందుకున్న గణనాథునికి భక్తులు శుక్రవారం వీడ్కోలు పలికారు. నందికొట్కూరు పట్టణంలో కొలువుతీరిన వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం విగ్రహాలను జూపాడుబంగ్లాలోని కెసి కెనాల్‌లో నిమజ్జనానికి తరలించారు. చిన్నా పెద్దా తేడా లేకుండా రంగులు చల్లుకుంటూ కేరింతలు, ఆనందోత్సాహాల మధ్య గణనాథులను ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపుతో బయలుదేరిన గణనాథులను తిలకించేందుకు ఆయా గ్రామాల ప్రజలు రోడ్లపైకి తరలివచ్చారు. సుమారు 70 పైగా విగ్రమాలను కెనాల్‌లో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నందికొట్కూరు రూరల్ సిఐ విజయ్‌భాష్కర్ పర్యవేక్షణలో ఎస్ఐ మారుతి శంకర్ గట్టి బందోబస్తు నిర్వహించారు. తహశీల్దార్ పుల్లయ్య యాదవ్ నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించిన ఆయన నిమజ్జనం జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రైవర్ రాముడు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు

## మునకలో నష్టపరిహారం అందిన పొలాలకు తిరిగి ఆన్‌లైన్ చేయకండి ; సర్పంచ్



**మిడుతూరు, సెప్టెంబర్22, ప్రభాతవార్త ;** మండలంలోని తలముడిపి గ్రామ పరిధిలోని కొన్ని పొలాలు అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, ఎస్ఆర్‌బీసీ కాలువలో మునకకు గురై నష్టపరిహారం అందిన పొలాలకు తిరిగి ఆన్‌లైన్ చేయకండి అని తలముడిపి గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్లు కోరారు. గ్రామ పరిధిలో మునకకు గురైన పొలాలకు నష్టపరిహారం అందిన కొందరు తిరిగి వాటిని తహసీల్దార్ కార్యాలయంలో తిరిగి ఆన్‌లైన్ చేసే ప్రయత్నం చేస్తున్నారని, దీనిపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి భవిష్యత్‌లో సమస్యలు తలెత్తే ఇలాంటి పనులను ప్రోత్సహించకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సర్పంచ్ కోరారు. ఈ విషయంపై తహసీల్దార్ ప్రకాష్బఆబుకు వినతి పత్రం అందజేసినట్లు సర్పంచ్ చెప్పారు.

## ఘనంగా వినాయక నిమజ్జన వేడుకలు



**కోవెలకుంట్ల, సెప్టెంబరు 22, ప్రభాతవార్త :** పట్టణంలో వినాయక నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణం లోని సుంకులమ్మ గుడి, గాందీనగరు నాల్గు చోట్ల, స్వామి నగరు, కుమ్మడి వీది, పాండు రంగ స్వామిదేవాలయం ,అయ్యప్పస్వామి దేవాలయం, శ్రీరామనగరు ., సాయినగరు., సర్కిల కార్యాలయసమీపము ఇందిరానగకు, అర్టిసి బసాండులో, మేదరవీది, చౌదమ్మగుడి, యస్‌యల్‌వి ట్యాకీసు, తదితర చోట్ల ఏర్పాట్లు చేసిన విగ్రహాలను అట్టహాసము తీసుకుని వెల్లి కుందూనదిలో నిమజ్జను చేశారు. అంతకు మందు అన్ని విగ్రహాలను వరుసక్ర మంగా పంపడానికి సిఐ నారాయణరెడ్డి, యస్ఐ వెంకటరెడ్డి, మౌలానా, కల్పన, ప్రతాప్ పర్యవేక్షించగా విగ్రహాల ముందర నృత్యాలు, డబ్బులు, మ్యుజిక్‌లతో హోరెత్తి ఊరేగింపుతో తీసుకుని వెళ్లి నిమజ్జనము చేశారు.

## జిల్లాస్థాయి పోటిలకు ఎంపికైన విద్యార్థినీ



**ప్యాపిలి సెప్టెంబరు22(ప్రభాతవార్త):** మండల పరిధిలోని జలదుర్గం గ్రామానికి చెందిన సాయిజాష్ణవి అనే విద్యార్థినీ జిల్లా స్థాయి కబడి పోటిలకు ఎంపికైనట్లు తల్లితండ్రులు తెలిపారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న సాయిజాష్ణవి బేతంచర్లలో జరిగిన తాలూకా స్థాయి కబడి పోటిలలో పాల్గోని విజయం సాధించి జిల్లా స్థాయి పోటిలకు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు వివరించారు. జిల్లా స్థాయి కబడి పోటిలకు ఎంపికైన విద్యార్థిని సాయిజాష్ణవిని ఉపాధ్యాయులు, తల్లితండ్రులు అభినందించారు.

## జగనన్న సురక్ష సర్వేను వేగవంతం చేయాలి



**దేవనకొండ, సెప్టెంబరు 22, ప్రభాతవార్త :** మండల పరిధిలోని పి కోటకొండ, చెల్లెల చెలిమిల గ్రామాల్లో జరుగుతున్న జగనన్న సురక్ష సర్వేను వేగవంతం చేయాలని వైద్యులు అరుణజ్యోతి, అథావుల్ల సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని పి కోటకొండ, చెల్లెలచె లిమిల గ్రామాల్లో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్ర మాన్ని, ఫ్రైడే, డ్రైడేను వారు పరిశీలించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ ప్రజలు రోగాల బారిన పడకుండ దూరంగా ఉండాలంటే ప్రతిఒక్కరు తమ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇందులో సబ్ యూనిట్ అధికారి సాయిబాబా, ఎంపిహెచ్ఈఒ రంగస్వామి, ఏఎన్ ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

## తిక్కారెడ్డిని విమర్శించేస్థాయి విశ్వనాథ్‌రెడ్డికి లేదు



**మంత్రాలయం, సెప్టెంబర్ 22, ప్రభా తవార్త:** మంత్రాలయం నియోజకవర్గం లో రెండుమార్లు ఎంఎల్ఏ అభ్యర్థిగా పోటీచేసిన తిక్కారెడ్డిని విమర్శించే స్థాయివైసిపి నాయకులు విశ్వనాథ్‌రెడ్డికి లేదని, విశ్వనాథ్‌రెడ్డి ఓ చెంచా అని టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ ఎల్లారెడ్డి అన్నారు. శుక్రవారం నియోజకవర్గకేంద్రమైన మంత్రాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా దయతో మీనాన్న సొసైటీ డైరెక్టర్‌గా సేవలు అందించినట్లు తెలిపారు. నీవు అన్నిరకాల పనుల్లో కమీషన్ డబ్బులు దండుకుంటూ కమీషన్ ఏజెంట్‌గా పనిచేస్తున్నావన్నారు. వగరూరు గ్రామంలో కాలువ పనుల్లో రైతులు సొంతంగా డబ్బులు వేసుకొని పనులు చేసుకుంటే నీవుమాత్రం రైతులకు తెలియకుండా కాలువ పనులకు దొంగబిల్లులు చేసుకొని అక్రమంగా డబ్బులుస్వాహా చేసినట్లు పేర్కొన్నారు. మండలంలోని గృహ నిర్మాణ బిల్లుల్లో బినా మీలుగా నీవారిని ఉంచుకొని రూ.లక్షల హౌసింగ్ బిల్లులు అధికారుల సహాయంతో కాజేశావన్నారు. మండలంలోని అక్రమ ఇసుక, కర్ణాటక మద్యం, రేషన్‌బియ్యం దందాలు నీద్వారానే జరుగుతున్నాయని వెల్ల డించారు. ఇలాంటి నీచపు పనులు చేసేనీకు తిక్కారెడ్డిని విమర్శించేస్థాయి ఎక్కడిదని మండిపడ్డారు. నకిలీ విత్తనాల కేసులో నేటికీ కర్ణాటక రాష్ట్రంలో నీవు ముద్దాయిగా ఉన్నావని స్పష్టం చేశారు. మండలంలోని విలువైన రైతుల భూములను గుర్తించి స్థానిక తహశిల్దార్ సహాయంతో ఆన్‌లైన్ అడంగల్ బంద్ చేయించి రైతల వద్దనుండిరూ.లక్షలు వసూలు చేసి అడంగల్‌ను ఓపన్ చేయిస్తున్నట్లు ఆరోపించారు. ఇందులో తహశిల్దార్‌కు మామూళ్ళు ఇస్తూ మీరుకూడా అక్రమంగా డబ్బులు దొబ్బేస్తున్నట్లు తెలియజేశారు. కాబట్టి ఇప్పటికైనా విశ్వనాథ్‌రెడ్డి స్థాయిని మరచిపోయి మట్లాడవద్దని హితవు పలికారు. మరోసారి తిక్కారెడ్డిని విమర్శిస్తే ఊరుకునేది లేదని ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చావడి వెంకటేష్, అమర్‌నాథ్‌రెడ్డి, అబ్దుల్, గోపాల్‌రెడ్డి, కేశన్న తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సద్గురు దక్షిణామూర్తి స్వాముల 31వ ఆరాధన



**ఆస్పరి, సెప్టెంబరు 22, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కారుమంచి గ్రామంలో వెలసిన శ్రీ సద్గురు దక్షిణామూర్తి స్వాముల 31వ ఆరాధన మహోత్సవాలు నేడు(శనివారం) ప్రారంభం అవుతున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మురళీధర్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మీ, వైస్ ఎంపిపి చంద్రకళలు తెలిపారు. 23న శనివారం రాత్రి 8గంటల నుండి గంగాధరయ్య స్వామి ఉపన్యాస కార్యక్రమాన్ని హలిగేర గ్రామం వారిచే నిర్వహిస్తామన్నారు. 24న ఆదివారం ప్రభాతసేవవ 9గంటలకు గంగపూజ, 9.30గంటల నుండి 11.30వరకు శ్రీ సద్గురు సమాధికి పంచామృతాభిషేకం, 11.30గంటలకు శ్రీ గాయత్రి మాత మహాయజ్ఞం, మద్యాహ్నం 12గంటలకు అన్నదానం, సాయంత్రం 5గంటల నుండి శ్రీ దక్షిణామూర్తి స్వాముల వారి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. **రాత్రి భజన పోటీలు :-** శ్రీ సద్గురు దక్షిణామూర్తి స్వాముల 31వ ఆరాధనోత్సవం సందర్భంగా ఆదివారం రాత్రి 9గంటలకు భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ది కమిటీ అధ్యక్షులు మురళీధర్‌రెడ్డి తెలిపారు. ఈ భజన పోటీల్లో పాల్గొనదలచిన వారు ఆదివారం రాత్రి 8గంటలకు రూ.300లు చెల్లించి తమ జట్ల పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన జట్లకు 1వ బహుమతి రూ.15,116లు, 2వ బహుమతి రూ.12,116లు, 3వ బహుమతి రూ.9,116లు, 4వ బహుమతి రూ.7,116, 5వ బహుమతి రూ.6,116లు, 6వ బహుమతి రూ.5,116లు, 7వ బహుమతి రూ.4,116లు, 8వ బహుమతి రూ.3,116లు, 9వ బహుమతి రూ.2,516, 10వ బహుమతి రూ.2,016, 11వ బహుమతి రూ.1,616, 12వ బహుమతి రూ.1,116లు అందచేస్తామని తెలిపారు.

## జిల్లా స్థాయికి ఎంపికైన బొల్లవరం విద్యార్థులు



**నందికొట్కూరు, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త:** నందికొట్కూరు నియోజకవర్గస్థాయి కబడ్డీ బాలికల స్కూల్ గేమ్స్ పోటీలలో 10.బొల్లవరం ఎం.పి.యు.పి.స్కూల్ ప్రదమ స్థానం పొంది జిల్లా స్థాయికి అండర్-14 విభాగంలో ఎంపిక అయినట్లుగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మినరసమ్మ తెలిపారు. 14 కబడ్డీ విభాగంలో శ్రీవల్లి, శశికళ, నితీషా, జిల్లా స్థాయికి ఎంపక అయ్యారని, ఖో-ఖో అండర్-14 విభాగంలో ఆనందరాజు జిల్లాస్థాయి ఎంపిక అయ్యాడని ఆమె తెలిపారు. నియోజకవర్గం స్థాయిలో మంచి ప్రతిభ కనపరిచి జిలా క్రీడలకు ఎంపికైన విద్యార్థులను గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినంధించారు.

## ఖో - ఖో పోటీలకు ఎంపికైన బాలికలు



**పగిడ్యాల, సెప్టంబరు 22, ప్రభాతవార్త :** జిల్లా స్థాయి ఖో-ఖో పోటీలకు పగిడ్యాల మండలం లక్ష్మాపురం అంచవద్ద ఉన్న డాక్టర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల బాలికలు ఎంపికయ్యారు. నందికొట్కూరు నియోజకవర్గ స్థాయిలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ అండర్ -14 ఖో-ఖో పోటీలలో విజయం సాధించారు. ప్రతిభకనబరిచిన బాలికలు కెప్టన్ అమ్ములు, పుష్పలత, యం.స్వాతి, బి.అరుణ, చందు, ఎస్తేరాణి, చందన జిల్లా స్థాయి ఖో-ఖో పోటీలకు ఎంపికైనట్లు పీడి ఆదిలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయురాలు లావాణ్య శుక్రవారంసాయంత్రం తెలిపారు. జిల్లా స్థాయి ఖో-ఖో పోటీలకు ఎంపికైన బాలికలను ప్రిన్సిపాల్ వెంకటరమణమ్మ, పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## దళిత రక్షణ యాత్రను విజయవంతం చేయండి



**ఆలూరు, సెప్టెంబరు 22, ప్రభాతవార్త :** దళితుల ఆత్మగౌరవం, ఉపాధి, సంక్షేమం భద్రతకై కెవిపిఎస్ ఆధ్వర్యంలో దళిత రక్షణయాత్రలో భాగంగా ఈ నెల 22 నుండి 25వ తేదీ వరకు నిర్వహించే జీపుజాతను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు కెపి నారాయణస్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని దళిత రక్షణయాత్ర కరపత్రాలను ప్రజలకు అందచేశారు. ఈ కార్యక్రమంలో రంగప్ప, మైనా, పురుషోత్తం, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## సౌత్ ఇండియా ఐకానిక్ బెస్ట్ టీచర్ అవార్డు



**గడివేముల, సెప్టెంబర్22, ప్రభాతవార్త ;** గడివేము లలోని శ్రీ రాజరాజేశ్వరి ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న భీమిశెట్టి మల్లికార్జున సౌత్ ఇండియా ఐకానిక్ బెస్ట్ టీచర్ అవార్డు- 2023కు ఎంపికయ్యారు. అతనిని శుక్రవారం నాడు పాఠశాల తరపున ఘనంగా సన్మానించారు. పాఠశాల కరస్పాండెంట్ యం.రామేశ్వరరావు, బి.మ ల్లికార్జున ప్రాథమిక విద్యను శ్రీ రాజరాజేశ్వరి ఉన్నత పాఠశాలలో అబ్యసించి ఎమ్మెస్సీ, బీఈడీ వరకు చదివి అదే పాఠశాలలో పనిచేస్తూ అవార్డు పొందడం మాకు చాలా సంతోషంగా ఉందని చెప్పా రు. ఏఓయంబీఎస్ రాఘవేంద్రరావు, యం.కృష్ణకాంత్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు

**నంద్యాల, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలో నంద్యాల్లో వినాయక నిమజ్జనం సందర్భంగా జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఇచ్చిన అదేశాలు పట్టించుకోవడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిమజ్జనం రోజున అన్ని మద్యం దుకాణాలు బంద్ చేయాలని స్పష్టమైన అదేశాలున్నప్పటికి కొన్ని మద్యం దుకాణాలు రోజంతా తెరచి ఉండడం విశేషం. ప్రజలు కూడ మద్యం దుకాణాలు తెరచి ఉండడంపై ఒకింత అశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. అధికారులు దీనిపై సమగ్ర విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు.

## బయలు వెడలే గణనాధుడు ఠీవిగా..



**కోసిగి, సెప్టెంబరు 22, ప్రభాతవార్త :** వినాయక చవితి సందర్భంగా గత ఐదు రోజులుగా నిత్యం పూజలు అందుకున్న వినాయకుడు శుక్రవారం సాయంత్రం ఠీవిగా బయలు వెడలే.. ముఖ్యంగా గణపయ్యకు అడుగడుగునా భక్తులు నీరాజనాలు పలికారు.. జై నాయకా.. జైజై వినాయకా, గణపతి బొప్ప మోరియా అంటూ భక్తులు జయ ధ్వనులు పలుకగా గణనాదుడు చల్లంగా గంగమ్మ చెంతకు చేరాడు. ముందుగా మహిళలు భారీ సంఖ్యలో చేరి గణపతికి పూజలు చేసి హారతులను చేపట్టారు. ఈ సందర్భంగా కోసిగిలోని వైఎస్సార్ సర్కిల్ నందు ఏర్పాటు చేసిన గజానానా వినాయక మిత్ర మండలి గణపతి ఎంతో సుందరంగా వెలుగొందాడు.. ఇందులో భాగంగా లడ్డు వేలం, స్వామి వారి చేతిలో టెంకాయ, విగ్రహానికి వేసిన శాలువలను భక్తుల మధ్య వేలం వేసారు..ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణపతిలను అత్యంత భక్తి పారవశ్యంతో తుంగభద్ర నదికి తరలించారు. దీంతో గ్రామంలో సంబరాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అలాగే మండలంలోని జంపాపురం, చిన్నభూంపల్లి, ఐరన్‌గల్, గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయకుడిని భక్తి శ్రద్దలతో నిమజ్జనం చేశారు. పలు వినాయక విగ్రహాలను నిర్వహకులు భక్తిశ్రద్దలతో నిమజ్జనం గావించారు. ముందుగా స్వామివారి సేవలో పాల్గొన్న వందలాది మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుడి విగ్రహ ఏర్పాటుకు సహకరించిన పలువురు భక్తులకు గజానానా వినాయక మిత్రమండలి సభ్యులు మఠం జగదీష్ స్వామి, మహంతేష్‌స్వామి, బుకిటీ వీరేష్‌లు సన్మానాలు చేసారు.. అనంతరం తుంగభద్ర నదిలో నిమజ్జనం చేసి తమ ముడుపులు చెల్లించుకున్నారు. గ్రామ యువకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## కళ్లకు గంతులు కట్టుకొని టీడీపీ నిరసనలు



**కోడుమూరు, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త :** చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా కోడుమూరులో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారంతో పది రోజులకు చేరింది. ఈ దీక్షల్లో భాగంగా ఇక్కడి శ్రేణులు విన్నూత్న రీతిలో స్థానిక పాతబస్టాండు ప్రధానరోడ్డులో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు చంద్రబాబు అరెస్టుపై తీవ్ర స్థాయిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌రెడ్డి అనుసరిస్తున్న చర్యలపై ఘాటుగా నినాదాలు చేశారు. సైకో పోవాలి సైకిల్ రావాలన్నారు. తమ నేతపై ఎన్ని కుట్రపూరితమైన చర్యలకు పాల్పడినా చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకు రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు కోట్ల కవితమ్మ, లక్ష్మయ్యశెట్టి, గోపాల్‌నాయుడు, రవీంద్రగౌడ్, అమడగుంట్ల వెంకటేశ్వరు ,మాదన్న, గూడూరు మండలం టీడీపీ నాయకులు సుదాకర్‌రెడ్డి, సుందర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎస్‌పై మాట తప్పి... మడమ తిప్పి.....



**ఆదోనిలీగల్, సెప్టెంబర్22, ప్రభాతవార్త ;** అధికారంలోకి వచ్చిన వారంలోనే సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేస్తామని చెప్పిన సీఎం మాట తప్పి, జీపీఎస్ పథకాన్ని మంత్రిమండలంలో ఆమోదించి ఉద్యోగులను మోసం చేయడం తగదని ఎస్టీయూ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ జి.వీరచంద్రయాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపక్షనేతగా పాదయాత్ర సమయంలో ఇడుపులపాయ నుంచి ఇచ్చాపురం వరకు అధికారంలోకి వచ్చిన వెంటనే వారం రోజుల్లో సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేస్తామని చెప్పిన మాటలు నీటిమూటల చందాన మారిపోయాయన్నారు. 30 సంవత్సరాలు ప్రభుత్వానికి, ప్రజలకు సేవ చేసిన ప్రభుత్వ ఉద్యోగులు పదవీవిరమణ తర్వాత జీవితాలకు భద్రత కలిగించే పెన్షన ఇవ్వడం ప్రభుత్వాల బాధ్యత అని చెప్పి ఇప్పుడు మాత్రం ఆరోజు అవగాహన లేక హామీ ఇచ్చామని చెబుతూ మాట మార్చి ప్రత్యామ్నాయంగా తలాతోక లేని జీపీఎస్‌ను అమలు చేస్తామని చెప్పి, కేబినెట్‌లో పెట్టి ఆమోదించడం సమంజసం కాదన్నారు. ఉద్యోగుల నోట్లో మట్టి కొట్టేలా వ్యవమరిస్తున్న ప్రభుత్వ తీరుపై ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆవేదనతో రగిలిపోతున్నారన్నారు. ఎలాంటి పరిస్థితుల్లో జీపీఎస్‌ను అంగీకరించేదే లేదన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని, జీపీఎస్ పథకాన్ని తెచ్చి దానిని ఉద్యోగులపై బలవంతంగా రుద్ది, చేతులు దులుపుకోవాలని ప్రభుత్వం నిరంకుశ వైఖరికి నిదర్శమన్నారు. పదకొండో పీఆర్‌సీ విషయంలో కూడా ఇదే మాదిరి కమిటీ నివేదిక బయటపెట్టకుండా బలవంతంగా పీఆర్‌సీని అమలు చేశరన్నారు. ప్రజాస్వామ్యంలో ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఎలాంఇ హామీ ఇవ్వని మనకంటే చిన్న రాష్ట్రాలైన చత్తీస్‌ఘడ్, పంజాబ్, జార్ఖండ్, సిక్కింలాంటి రాష్ట్రాలు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేస్తుంటే మన ప్రభుత్వం మాత్రం అది సాధ్యం కాదని చెప్పడం చూస్తే ఉద్యోగుల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతుందన్నారు. ఇలా ప్రతి విషయంలో ఉద్యోగులను దగా చేయడం ప్రభుత్వానికే అలవాటుగా మారిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి జీపీఎస్ ప్రతిపాదనను విరమించుకుని ఇచ్చిన హామీ మేరకు ఓపీఎస్‌ను అమలు చేసి, తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. లేనిపక్షంలో సంఘం పక్షాన ఫ్యాప్టో పక్షాన జరిగే ఉద్యమాలకు ప్రభుత్వమే సమాధానం చెప్పాలన్నారు.

## ఘనంగా విఘ్నేశ్వరుడికి విడ్కోలు



**నంద్యాల క్రైం ,సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** జిల్లా ఎస్పీ కార్యాలయంలో గత వారం రోజులుగా విఘ్నేశ్వరునికి ఘనంగా పూజలు నిర్వహించారు. భక్తి శ్రద్దలతో పూజ కార్యక్రమాలు చేశారు. జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, డిఎస్పీ మహేశ్వరరెడ్డి, ఎస్‌బి డిఎస్పీ సంతోష్‌లు పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పట్టణంలో దాదాపు 200కు పైగా విగ్రహాలు భక్తాదులు ఏర్పాటు చేసుకున్నారు. ప్రతివిగ్రహం వద్ద భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. ఐదు రోజుల పాటు ప్రశాంతంగా ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా వినాయకుడి విగ్రహ పూజలకు గట్టి భద్రత ఏర్పాట్లు చేశామని తెలిపారు. వినాయక విగ్రహాన్ని సిబ్బందితో పాటు అధికారులు కలిసి చెరువుకట్టలో గణేష్‌మహారాజ్‌కు జై అంటూ గణనాధున్ని నీటిలో వదిలేశారు. నంద్యాల నియోజకవర్గంలోని గణనాధుని దయలతో సుఖసంతోషాలతో ఉండాలని ఎస్పీ కోరారు. ఎస్పీ సిసి నాగరాజు, సిఐలు జయరాము, టౌన్ సిఐలు రామకృష్ణ, నరసింహులు, ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించండి

### - జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి



**బేతంచెర్ల, సెప్టెంబర్22, ప్రభాతవార్త:** మండలంలో నెలకొన్న ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం స్థానిక శేషారెడ్డి హైస్కూల్ ఆవరణంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావడం జరిగింది. ఏపీ వ్యవసాయ సంఘం, రైతు సంఘం, కౌలు రైతుల సంఘం నాయకులు ఖరీఫ్ సీజన్‌లో రైతులు పూర్తిగా నష్టపోయారని మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి కౌలు రైతులకు సైతం నష్టపరిహారాన్ని యాజమాన్యంతో సంబంధంలేకుండా చెల్లించాలని అర్జీ ఇవ్వడం జరిగింది. అలాగే నగర పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పనులను వ్యవసాయ కార్మికులకు కల్పించాలని వారు కోరారు. అలాగే పలువురు రైతులు తమ పొలాలు ఆన్‌లైన్‌లో ఎక్కడంలేదని అర్జీలు ఇవ్వడం జరిగింది. దీని పై స్పందించిన జాయింట్ కలెక్టర్ ప్రత్యేక సర్వే చేయించి రైతుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఇతర సమస్యల పై పలువురు ఫిర్యాదులు అందజేశారు. ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత శాఖలకు జాయింట్ కలెక్టర్ ఆదేశించడం జరిగింది. ఆయనతోపాటు ఆర్డీవో వెంకటరెడ్డి, తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఎంపిడివో వెంగన్న, ఎంపిపి బుగ్గన నాగభూషణంరెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలంరెడ్డి, మండలస్థాయి అన్ని శాఖల అధికారులు, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## జగనన్న భూహక్కు పత్రాల పంపిణీ



**చాగలమర్రి, సెప్టెంబర్22, ప్రభాతవార్త:** చాగలమర్రి మండల పరిధిలోని పెద్దవంగలి గ్రామంలో జగనన్న భూహక్కుపత్రాలను సర్పంచ్ బరంగారు షరీఫ్ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 120 సంవత్సరాల ముందు బ్రిటిష్ ప్రభుత్వం కొలిచిందన్నారు. నేడు ప్రభుత్వం రీసర్వేచేసి ఉన్న పొలానికి హద్దులు ఏర్పరిచి వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకం అమలు చేసి జగనన్న భూహక్కు పత్రాన్ని ఇవ్వడం హర్షణీయమన్నారు. భూహక్కు పత్రంలో పొలంకు సంబంధించిన హద్దులు, పొలం చిత్రం నమునా తదితర అంశాలను చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామరెవెన్యూ అధికారి దేవ, శిఖామణి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మచెంతకు గణనాధులు



**బండిఆత్మకూరు, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో శుక్రవారం బొజ్జ గణపయ్యకు గత ఐదు రోజులుగా పూజలందుకొని అత్యంత భక్తిశ్రద్దలతో శుక్రవారం గంగమ్మచెంతకు చేరారు. ఈసందర్భంగా గణపయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. ప్రత్యేక అలంకరణతో ట్రాక్టర్లపై మేళతాళాలు, బాణసంచా, యువకుల కేరింతలతో గణపతి నిమజ్జనం కోలాహాలంగా నిర్వహించారు. ముందుగా మహిళలు గణపతికి పూజలు చేసి హారతులు పట్టారు. అనంతరం గంగమ్మ చెంతకు వినాయకున్ని చేర్చారు. ఎస్ఐ మల్లికార్జున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలుగా పోలీస్‌బందోబస్తు ఏర్పాటు చేశారు.

## వర్షానికి ఉప్పొంగిన పాలేరు వాగు

### - రాకపోకలకు అంతరాయం



**మహానంది, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** మహానందిలో రాత్రి కురిసిన వర్షానికి మహానంది సమీపంలోని పాలేరువాగు ఉధృతంగా ప్రవహించింది. దీంతో మహానంది క్షేత్రానికి వచ్చిన భక్తులకు అంతరాయం ఏర్పడింది. బోయలకుంట్ల నుండి మహానందికి వచ్చే రహదారిలో ఉన్న ఈపాలేరువాగు గత కొన్ని సంవత్సరాలుగా వంతెన నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మహానంది చుట్టు పక్కల గ్రామాలకు వెళ్లాల్సిన రైతులు, భక్తులు ఈదారి గుండా వెళ్లాల్సి ఉంది. అయితే నీరు అధికంగా ప్రవహించడంతో భక్తులకు రహదారి అంతరాయం ఏర్పడింది

## గంగమ్మ ఒడికి చేరిన గణనాధులు



**మహానంది, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** మండలంలో గత ఐదు రోజులుగావిశేష పూజలందుకున్న గణనాధులు గంగమ్మ ఒడికి చేరారు. మహానందిలో దేవస్థానం ఆలయానికి చెందిన వినాయక విగ్రహం వద్ద ఇఒ చంద్రశేఖర్‌రెడ్డి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం లడ్డు వేలం పాటలు నిర్వహించారు. ఈ వేలాలు మహానందికి చెందిన భవనాసి యల్లయ్య రూ.12,500లకు దక్కించుకున్నారు. మహానందిలో ఉన్న అన్ని వినాయక విగ్రహాలు ఆలయ ప్రదక్షణ అనంతరం గుడిముందర అన్ని నిలిపి అనంతరం గంగమ్మఒడికి చేరాయి.

## ఆయుస్మాన్ భారత్ మేళా కార్యక్రమం



**కర్నూలు అర్బన్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** కర్నూలు టౌన్ వడ్డెగెరిలోని డా.వైయస్‌ఆర్ ప్రాధమిక పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న అయుస్మాన్ భారత మేళా ర్యాలీలో పాల్గొన్న రాష్ట్రీయ అర్‌బిఎస్‌కే అధికారిన హేమలత మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలు వ్యాధుల భారీన పడి తమ విలువైన జీవితాలను కోల్పోకుండా ఆరోగ్యంగా జీవించేలా మరియు పేదల ఆరోగ్య రక్షణకు భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్‌భవ కార్యక్రమాన్ని అమలు చేసు ్తందని కార్యక్రమంలో భాగంగా వైద్యపరీక్షలు, వ్యాధుల గర్తింపు, ఉచిత మందులు, దీర్ఘకాలిక సమస్యలు వున్నవారిని గురి ్తంచి వైద్యసేవలు అందిస్తారని తెలిపారు. డా.వైయస్‌ఆర్ ప్రాధమిక పట్టణ ఆరోగ్యకేంద్రం వైద్యధికారి హాకీం మాట్లాడుతూ ప్రతికుటుంబానికి దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రంలోనైనా రూ.5 లక్షల విలువైన ఆరోగ్యసేవలు పూర్తి ఉచితంగా అందజేయడమే ఈపథకం ముఖ్య ఉద్దేశ్యం ప్రజలకు ఆరోగ్యపథకాలు, మరియు వ్యాధుల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

## బాబుకు తోడుగా మేముసైతం



**పత్తికొండ, సెప్టెంబరు 22, ప్రభాతవార్త :** తెదేపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు తోడుగా మేముసైతం అని తెదేపా నాయకులు అన్నారు. తెదేపా పత్తికొండ నియోజకవర్గ ఇంచార్జ్ కెఈ శ్యాంబాబు ఆధ్వర్యంలో శుక్రవారం 10వ రోజు రిలేనిరాహార దీక్షలు కొనసాగాయి. తెలుగుదేశం పార్టీ తుగ్గలి మండల కమిటీ సభ్యులు నిరాహార దీక్ష శిబిరం వద్ద దీక్షలు చేపడుతున్న వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం కక్ష్యసాధింపుతోనే మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును అక్రమ కేసులో ఇరికించి అరెస్టు చేయించిందన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టు దుర్మార్గమన్నారు. ఒక నియంతపై పోరాటం కోసం బాబుకు తోడుగా మేముసైతం అంటూ రిలే దీక్షల్లో కూర్చున్నామన్నారు. తక్షణమే చంద్రబాబును విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికులకు ఘన సన్మానం



**పెద్దకడబూరు, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త:** స్వచ్ఛత సేవ 2023 కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన పెద్దకడబూరులో స్థానిక సచివాలయం నందు పంచాయతీ కార్మికులకు వాటర్ సిబ్బందికి శుక్రవారం గ్రామ సర్పంచ్ రామాంజినేయులు ఆధ్వర్యంలో ఘనంగా సనా ్మనించారు. కార్మికులకు దుశ్శాలువా, పూలమాల వేసి వారు చేసిన సేవలను కొనియాడారు. ఈ ఎసందర్భంగా యాయన మాట్లాడుతూ కార్మికులు చాలీచాలని జీతాలతో ఎంతో సేవా దృక్పథంతో ప్రజలకు సేవలు చేస్తున్నారని, ముఖ్యంగా డ్రైనేజీ కాలువలు, రోడ్డు శుభ్రపరచడం, వీధిదీపాలు, తాగునీటి సరఫరా తదితర పనులను చేస్తూ ముందుకెళుతున్నారని వారిని ఇబ్బంది పెట్టకుండా కాలనీల ప్రజలు సహకరించాలన్నారు. గ్రామం పరిశుభ్రంగా ఉండాలంటే పంచాయతీ కార్మికుల పాత్ర ఎంతో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దస్తగిరి, వెల్ఫేర్ అసిస్టెంట్ విజయలక్ష్మి, గ్రామ సర్వేయర్ లలిత సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా వినాయక నిమజ్జనోత్సవం



**బనగానపల్లె, సెప్టెంబర్22, ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలో వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. పట్టణంలో సుమారు 56వినాయక విగ్రహాలను ఆయా ఉత్సవ కమిటీల వారు ఈనెల 18వ తేది కొలువుదీర్చి ఐదు రోజులపాటు పూజలు నిర్వహించారు. అనంతరం గణనాథులను ఆయా గణేష్ కమిటీల ఆధ్వర్యంలో డీజే సౌండ్స్ మధ్య, సాంస్కృతిక కార్యక్రమాల మధ్య కోలాహలంగా పట్టణంలోని పురవీధుల గుండా కన్నులపండువగా గ్రామోత్సవంగా నిమజ్జనానికి తరలించారు. శుక్రవారం ఉదయం మండపాల వద్ద ఆయా గణేష్ కమిటీల ఆధ్వర్యంలో టిఫిన్, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆదేశానుసారం విగ్రహాలను క్రమపద్ధతిలో నిమజ్జనానికి బయలుదేరి వెళ్లాయి. వినాయకులకు ప్రత్యేక పూజల అనంతరం గ్రామోత్సవంలో భాగంగా వివిధ ప్రాంతాలలో భక్తులు రంగులు జల్లుకుని ఆనందాన్ని పంచుకున్నారు. వినాయకులను ప్రత్యేక వాహనాల పై నిలిపి నిమజ్జనానికి తరలించారు. ఈ వేడుకలో భాగంగా నిర్వహించిన డీజే డ్యాన్స్‌లు, కోలాటాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూసేందుకు పట్టణ, మండల ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చి వీక్షించారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా అవుకు మెట్ట వరకు ఊరేగింపు చేయడం తిరిగి కైప చెవురు వద్ద ఏర్పాటుచేసిన వినాయక ఘాట్ వద్ద నిమజ్జనం చేయడం ఆనవాయితీగా వస్తుంది. ఈ పద్ధతిని ఈసారి కూడా కొనసాగించారు. పట్టణంలోని అమ్మవారిశాల, పెండేకంటినగర్, గ్రౌండ్, కూరగాయల మార్కెట్, కరెంట్ ఆఫీస్ ఏరియా, పాత శివాలయం దగ్గర, మండల ఆఫీస్ దగ్గర తదితర చోట్ల నిలిపి వినాయకుల వద్ద ఎక్కువ సందడి చోటు చేసుకుంది. భోజనాల అనంతరం వినాయకులను ప్రత్యేక వాహనాలలో ఉంచి పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. వినాయక ఉత్సవాల్లో భాగంగా ఆయా మండపాల నిర్వాహకులు ముగ్గుల పోటీలు, పౌరాణిక నాటకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బనగానపల్లె సీఐ తిమ్మారెడ్డి పర్యవేక్షణలో ఎస్ఐలు పి. రామిరెడ్డి, నందివర్గం ఎస్ఐ రామాంజనేయరెడ్డిల ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు నిర్వహించారు. అలాగే బనగానపల్లె పట్టణ, కైప గ్రామ పంచాయతీ సిబ్బంది ఆయా పరిసరాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడంతోపాటు విద్యుత్ సిబ్బంది గ్రామోత్సవంలో విద్యుత్ సరఫరాకు ఆటంకంలేకుండా చర్యలు చేపట్టారు. అలాగే గణనాథుల గ్రామోత్సవంలో ఎలాంటి అవాంతరాలు లేకుండా పట్టణ గణేష్ కమిటీ సభ్యులు న్యాయవాది మాధవరెడ్డి, దమ్మాల వెంకటసుబ్బయ్య, జగన్నాథరెడ్డి, కుమ్మరి సురేష్‌తోపాటు కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. కైప చెరువు వద్ద ఏర్పాటుచేసిన వినాయక ఘాట్ వద్ద కూడా పోలీసులు బందోబస్తు నిర్వహించి తోపులాటలు లేకుండా వరుస క్రమంలో విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు.

## వినాయక నిమజ్జనంలో పాల్గొన్న గుడిసె కృష్ణమ్మ



**ఆదోని రూరల్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త :** పట్టణంలో శుక్రవారం జరిగిన వినాయక నిమజ్జనం సందర్భంగా విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో నిమజ్జనానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ మాజీ ఇంచార్జ గుడిసె ఆది కృష్ణమ్మ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర బిసి సెల్ ఉపాధ్యక్షుడు గుడిసె శ్రీరాములు, వడ్డేమాన్ గోపాల్, మాజీ ఎంపిపి మురళీ, సాదిక్‌వలి, చిరంజీవి, భరత్ కుమార్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## చంద్రయాన్-3 విజేతలు

**-గుడ్‌షెఫర్డు పాఠశాల విద్యార్థుల ప్రతిభ**



**నంద్యాల విద్య ,సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** నంద్యాల జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు చంద్రయాన్-3 వి స్రోకు సంబంధించిన క్విజ్ కాంటెస్టు పరీక్ష లను నిర్వహించారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్, ప్రభుత్త పాఠశాలల్లో విద్యార్థులు సుమారు 1000 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో గుడ్‌షెపర్డు పాఠశాల విద్యార్థినిలు ఫస్ట్, సెకెండ్ బహుమతుల పాటు 8 కన్సోలేషన్ బహుముతు సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ జెస్సీ పాల్ తెలిపారు. చంద్రయాన్-3లో విస్రోశాస్త్రవేత్తలు ఏవిధంగా విజయాని సాధించారు. ప్రపంచంలోని విస్రోకున్న ప్రత్యేకత ఏమిటి అన్న విషయాలపై కూడ వారు చర్చించారు. 9వ తరగతి విద్యార్థిని తేజస్సీని మొదటి బహుమతి గెలుపొందగా, 10వ తరగతి విద్యార్థిని హరిచందన ద్వితీయస్థానం సాధించింది. వెంకటభార్గవ సుస్మీత, వెంకటభార్గవ సుశాంత్, సహరా, యువరాజ్, దీక్షిత, యస్విత, తేజేశ్వర్, మధువర్షిత్‌కుమార్ కన్సోలేషన్ బహుమతులు సాధించారు. వీరికి శిక్షణ ఇచ్చిన సైన్స్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్న దృశ్యం

## కంపచెట్లను తొలగించిన విద్యుత్ అధికారులు

**-ప్రభాతవార్తకు స్పందన**



**నంద్యాల హాస్పటల్ ,సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** నంద్యాల పట్టణం వైయస్ఆర్ నగర్‌లో కరెంటు తీగలకు అడ్డంగా ఉన్న ముళ్ళచెట్లు అనే శీర్షిక ప్రభాతవార్తలో వచ్చిన కథనానికి స్పందించి విద్యుత్ అధికారులు చెట్లను తొలగించారు. దీంతో కాలనీ వాసులు, పలువురు స్పందించిన విద్యుత్ అధికారులకు అభినందించారు. నిత్యం తీగల ద్వారా ఏ అపాయం సంభవిస్తుందోనని కాలనీ వాసులు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదిసేవారు దీంతో కాలనీ వాసులు కొంచెం ఊపిరిపీల్చుకున్నారు.

## వైభవంగా గణేష్ నిమజ్జన



**నంద్యాల సిటి, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** నంద్యాల పట్టణంలో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని శుక్రవారం వైభవంగానిర్వహించారు. పట్టణంలోని అన్ని కాలనీల్లో కొలువైన గణనాధులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐదు రోజుల పూజల అనంతరం గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మేళతాళాల మధ్య వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. 38వ వార్డులో కొలువైన గణేష్ మండపం వద్దకు కాలనీకి చెందిన టిడిపి నాయకుడు తాటికొండ బుగ్గరాముడు వెళ్లి పూజలు నిర్వహించారు. అనంతరం తన అధ్వర్యంలో యువకులు కేరింతలు కొడుతూ రంగులు చల్లుకుంటూ ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. చిన్నచెరువు వద్దకు తీసుకెళ్లి నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు.

## మూల పెద్దమ్మ తల్లి హుండీ లెక్కింపు

**- రూ.4,57,761 హుండీ ఆదాయం**



**గడివేముల, సెప్టెంబర్22, ప్రభాతవార్త ;** మండల కేంద్రమైన గడివేములలో కొంగు బంగారంలా విరాజిల్లుతున్న శ్రీ మూల పెద్దమ్మతల్లి అమ్మవారి హుండీ శుక్రవారం నంద్యాల దేవదాయ ఇన్‌స్పెక్టర్ శశికుమార్ పర్యవేక్షణలో లెక్కించారు. రూ.4,57,761 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ మోహన్ తెలిపారు. వచ్చిన ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు వినియోగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ మోహన్, పర్యవేక్షణాధికారి శశికుమార్, ఆలయ చైర్మన్ చిన్నన్న, ఆలయ సిబ్బంది, ఆలయ అర్చకులు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కుడ పోత వర్షం - అనందోత్సవంలో రైతన్నలు



**కోవెలకుంట్ల, సెప్టెంబరు 22, ప్రభాతవార్త :** ఖరీఫ్ పంటలు సాగు చేసినప్పటి నుండి వర్షము కోసం మొఖము వాచి ఉన్న రైతన్నలకు గురువారము అర్ధరాత్రి కుండ పోతగా వర్షము కురువడముతో జిల్లా వ్యాప్తంగా రైతన్నలు అనందోత్సవముగా ఉన్నారు. గురువారము అర్ధరాత్రి ఎడతెరపి లేకుండా కుండ పోతగా వర్షము కురువడముతో వాగు వంకాలు పొంగి ప్రవహించారు. రబీకి సిద్ధమైన పొలాల్లో రసాయ ఎరువులు విత్తున్న రైతన్నలు వర్షము తాకిడికి ఒక్క సారి ట్రాక్టర్లతో పలాయమని చిత్తగించారు. ముఖ్యంగా జిల్లా అదికముగత 15 రోజుల క్రితము రైతులు విస్థారణంగా మిరప పంటను సాగు చేశారు అలాగే అంతకు మునుము పత్తి మినుము, కంది ఇతర పంటలను రైతులు సాగు చేయగా వాటిని ఈ వర్షము రాకతో సిరులు పండుతాయని రైతులు అంటున్నారు. అలాగే రబీకి కూడా ఈ కుండ పోత వర్షము ఎంతో మేలు చేస్తుందని అంటున్నారు. ఈ కుండ పోత వర్షముతో పొలాల్లో ఎటు చూసిన వర్షము నీరు కనిపిస్తుంది. ముఖ్యంగా నంద్యాల జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో వర్షము నమోదు కావడముతో జరిగింది. జిల్లా అత్యధికము శిరువెళ్ల మండలంలో 105.4యంయం కాగా అత్యల్పము బనగానపల్లెలో కేవలము 3.4యంయం నమోదు అయింది. అలాగే కోవెలకుంట్ల 52యంయం, దొర్నిపాడులో 30.4యంయం, అళ్లగడ్డలో 18యంయం, చాగమర్రిలో 8.4యంయం, గడివేముల్లో 7.6యంయం, కొలిమగుండ్లఓ 21.2యంయం, మహానందిలో 53.2యంయం, నందా ్యల్లో 23.4యంయం, పాణ్యంలో 13.2యంయం, రుద్రవరములో 91.8యంయం, సంజామల్లో 34.6యంయం, ఉయ్యాలవాడలో 8.4యంయం, బేతంచెర్లఓ 4యంయం, అవుకులో 32.2యంయం వర్షముకురిసింది, డోన్ డివిజన్‌లో మొత ్తంగా 92.3యంయంయ, నంద్యాల డివిజన్‌లో 442.8యంయం వర్షము కురువగా వర్షము కురిసిన అన్ని మండల్లో పంటకళ కళాడుతున్నండా రైతన్నలు అందోత్స వామద్య ఉన్నారు..

## జగనన్న ఆరోగ్య సురక్ష.. ప్రజలందరికి మెరుగైన వైద్యం..



**ఆత్మకూరు సెప్టెంబర్22, ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్య మంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టానా త్మకంగా వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆశ యంతో జగనన్న ఆరోగ ్య సురక్ష కార్యక్రమంను ప్రారంభించారు. శుక్రవారం నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం ఆత్మకూరు మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష క్రింద మెరుగైన వైద్య సేవలు అందించే విదంగా ముందుంటామని ఆరోగ్య కార్యకర్త పద్మావతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బైర్లూటి ప్రాధామిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని వైద్యాధికారులు గోపాల్, పవన్‌కుమార్ ఆదేశాల మేరకు గ్రామంలో ప్రజలందరికి వైద్య పరీక్షలు చేస్తూ ముందుకు వెళ్తూన్నామన్నారు. ఈ కార ్యక్రమంలో ప్రజలకు బిపి, షుగర్, డెంగ్యూ, రక్తపరీక్షలు, మలేరియా, సుదీర్ఘ వ్యాది లక్షణాలను గుర్తించే విదంగా ఆరోగ్యశాక పనిచేస్తుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పేద ప్రజల ఆరోగ్య జాగ్రత్తలపై ప్రత్యేక చొరవ తీసుకునే విదంగా వైద్యశాఖ పనిచేస్తున్నట్లు వెల్లడించారు.

## ఘనంగా వినాయక నిమజ్జనం వేడుకలు



**కొత్తపల్లి, సెప్టెంబర్22, ప్రభాతవార్త ;** మండలంలోని ఎదురుపాడు గ్రామంలో వినాయక నిమజ్జనం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వినాయకచవితి పండగరోజు నుంచి ఐదు రోజుల పాటు మండలంలో విగ్రహాలు ఏర్పాట్లు చేసి ఈ ఐదు రోజులు వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం కమిటి నిర్వహకులు వినాయకుని లడ్డు వేలం నిర్వహించి వినాయకుని నిమజ్జనం కన్నులపండగగా జరిగింది. వీధుల వెంట వినాయకుడిని ఊరేగించి ఎదురుపాడు తిమ్మరాజుకుంట చేరువులో నిమజ్జనం చేశారు.

## వరల్డ్ హార్టు డే వాల్‌పోస్టర్ విడుదల




**కర్నూలు అర్బన్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** కరూ ్నలు కలెక్టరు క్యాంపు అఫీసులో ప్రపంచ హృదయ దినోత ్సవ వేడుకల సందర ్భంగా వాల్‌పోస్టర్‌ను జిల్లా కలెక్టరు డా.జి సృజన చేతులమీద ప్రారంబించినట్లు డా.పి.చంద్రశేఖర్ ఎండి, డిఎం, ఎఫ్ఎసిసి కార్డియాలజిస్టు కార్యదర్శి కె హెచ్‌ఎఫ్ కర్నూలు, తెలియజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు హార్ట్‌ఫౌండేషన్, కర్నూలు అండ్ ఏపీ కార్డియాలజికల్ సొసైటి అఫ్ ఇండియా ఏపీ చాప్టర్ అధ్వర్యంలో 2005 నుంచి ఇప్పటి వరకు క్రమం తప్పకుండా ప్రపంచ హృదయ దినోత ్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. సెప్టెంబరు 29,2023 శుక్రవారం సాయంత్రం ఏ క్యాంపులో ఉన్న కర్నూలు హెల్త్‌క్లబ్ నందు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా.జార్జ్ జోషప్ ఎండి డిఎం ఎఫ్‌సిఎస్ఐ క్రిస్టియన్ మెడికల్ కళాశాల కార్డియాలజి ప్రొఫెసర్ వస్తున్నట్లు తెలిపారు. అత్యుత్తమ వ్యక్తి అఫ్ ది ఇయర్ అవార్డు అందుకుంటారు. మరియు ప్రధాన ప్రసంగం చేస్తారని తెలిపారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టరు డా.జి.సృజన అధ్యక్షత వహించనున్నారు. ఎపీసిఎస్ఐ, యూనియన్ బ్యాంకు అఫ్ ఇండియా, కర్నూలు అధ్వర్యంలో ప్రపంచ హృదయ దినోత ్సవ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా.సృజన కలెక్టరు అండ్ జిల్లా మేజిస్ట్రేట్ కర్నూలు, డా.చంద్రశేఖర్ హార్ట్ ఫౌండేషన్ సెక్రెటరీ, కల్కూర చంద్రశేఖర్, డా.భవానీ ప్రసాద్, డా.వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర్ల కుటుంబానికి అన్ని రకాలుగా అండగా ఉంటాం

**- డోన్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి**



**బేతంచెర్ల, సెప్టెంబర్22, ప్రభాతవార్త:** తేదేపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టను జీర్ణించుకోలేక ఇటీవల ఆత్మహత్య చేసుకున్నా గోరుమానుకొండ టీడీపీ కార్యకర్త తెలుగు వెంకటేశ్వర్లు కుటుంబానికి టీడీపీతోపాటు తాను అన్ని రకాలుగా అండగా ఉంటానని డోన్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం గోరుమానుకొండలోని వెంకటేశ్వర్లు ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు కోసం తెలుగు వెంకటేశ్వర్లు ఆత్మహత ్య చేసుకోవడం బాధాకరమన్నారు. ఏది ఏమైనా కుటుంబ సభ్యులకు ఎలాంటి సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పార్టీ ద్వారా కాని, తాను కాని తక్షణమే పరిష్కరిస్తామని కుటుంబ సభ్యులకు భరోసానిచ్చారు. ఆయనతోపాటు టీడీపీ మండల కన్వీనర్ ఉన్నం యల ్ల నాగయ ్య, ఎస్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి రవీంద్ర నాయక్, మాజీ ఎంపిటిసి జాకీరుల్లాబేగ్, బీసీసెల్ నాయకులు లోకేష్ గౌడ్, చంద్ర, స్థానిక నాయకులు కృష్ణయ్య, ఆంజనేయులు, సుబ్బయ ్య తదితరులు ఉన్నారు.

## అట్టహాసంగా నిమజ్జనానికి తరలి వెళ్ళిన గణపయ్యులు



**నందికొట్కూరు, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త:** పట్టణంలో గత అయిదు రోజులుగా మండపాలలో కొలువుతీరి ప్రత్యేక పూజలు అందుకున్న బొజ్జగణపయ్యలు శుక్రవారం పట్టణ పురవీధుల గుండా ఊరేగుతు నిమజ్జనానికి భయలు దేరారు. పట్టణంలో దాదాపు 63 చోట్ల కొలువుతీరిన వినాయకులు ఉదయం నుండి భక్తులచే పూజలు అందుకొని సాయంత్రం 3గంటల నుండి అశేషభక్తజనులు జైజై గణేష అంటు నినాదాల చేస్తుండగా గణపయ్యలు బయలుదేరి జూపాడుబంగ్లా కె.సి. కెనాల్ వద్ద ఏర్పాటు చేసిన నిమజ్జన ఘాట్ గణయ్యలకు నిమజ్జనమయ్యారు. పలుచోట్ల వినాయకుని లడ్డు వేలం వేయాగా వేల రూపాయలతో భక్తులు దక్కించుకున్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ భంధోబస్తు ఏర్పాటు చేశారు.



## “ మెరిసిన నారీ కీరిటం..’

:- మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఉభయ సభల ఆమోదం ..

:- ఇప్పటికే స్థానిక సంస్థల్లో అమలవుతున్న మహిళా రిజర్వేషన్

:- ఇక చట్ట సభల్లోనూ తమ ప్రతిభ చూపనున్న మహిళలు ..

:- రాష్ట్రంలో మహిళలకే అధిక ప్రాధాన్యత కల్పిస్తున్న వైసీపీ ప్రభుత్వం

:- గత స్థానిక సంస్థల ఎన్నికల్లో 50శాతం సీట్లు కేటాయించిన వైనం

:- కర్నూల్ జిల్లాలో సగానికి పైగా ఎంపిపి, జడ్పీటీసీ పదవుల్లో మహిళలే ..

:- 32మంది మండలాధ్యక్షులు- 27మంది జడ్పీటీసీలు మహిళలే



**కొలిమిగుండ్ల, సెప్టెంబరు 22, ప్రభాతవార్త :** దేశ అత్యున్నత చట్ట సభల సాక్షిగా నారీ కీరీటం ధగ ధగ మెరిసింది. సుదీర్ఘ కాలం నిరీక్షణ తర్వాత చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం లభించింది. పార్టీలకతీతంగా దాదాపు సభ్యులందరూ ఏకగ్రీవంగా మహిళా బిల్లుకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. చట్ట సభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పిస్తూ బిజెపి ప్రభుత్వం ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లో తీసుక వచ్చిన బిల్లుకు ఉభయ సభల్లోనూ అమోదం లభించి ంది. అయితే జనగణన, డీలిమిటేషన్ తర్వాతే ఈ బిల్లు అమలులోకి వస్తుందని కేంద్రం ప్రకటించింది. ఎట్టకేలకు చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం లభించడంతో మహిళల నుండి హర్షం వ్యక్తమవుతోంది. మహిళా బిల్లు ప్రకారం చూస్తే ఉమ్మడి కర్నూల్ జిల్లాలో నాలుగు నుండి 5స్థానాలు మహిళలకు దక్కే అవకాశం వుంది. దీంతో చట్ట సభల్లో సైతం ఇక మహిళా లోకం తమదైన ముద్ర వేసే అవకాశం ఏర్పడింది. ఒకప్పుడు ఒంటింటికే పరిమితమైన మహిళలు ప్రస్థుతం అన్ని రంగాల్లో మహిళలతో సమానంగా రాణిస్తూ తమ ప్రతిభను చాటుతున్నారు. ఈ కోవలోనే చాలా కాలంగా చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు చర్చకు వస్తున్నప్పటికీ అది కార్య రూపం దాల్చలేదు. కాగా ప్రస్థుతం బిజెపి ఎన్నికల కోసమే ఆగమేఘాన మహిళా బిల్లును తీసుకవచ్చిందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే కారణమేదైనా మహిళా బిల్లుకు ఇప్పటికైనా చట్ట రూపం దాల్చడం అభినందనీయమేనని పలువురు రాజకీయ విశ్లేషకులు పెర్కొంటున్నారు. కాగా ఇప్పటికే స్థానిక సంస్థల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ ప్రక్రియ అమలవుతోంది. 1992లో రాజ్యాంగంలోని 73, 74 ఆర్టికల్స్‌ను సవరించడం ద్వారా ప ంచా య ౖ తీ ల ు , మున్సిపాలిటీలలో మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్ అమలు చేస్తున్నారు. అయితే రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తుండటం గమనార్హం. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో 50శాతానికి మించి స్థానాలకు మహిళలకు కేటాయించి, మహిళల ప్రాధాన్యతను తెలియజేసింది. మరో అడుగు ముందుకేసి పార్టీ నామినేటేడ్ పోస్టుల్లో సైతం మహిళలకు అత్యధిక పదవులు కట్టబెట్టింది. దీంతో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి కర్నూల్ జిల్లాలోని అత్యధిక మండలాల్లో ఎంపిపిలు, జడ్పీటీసీలుగా అతివలే ఆసీనులయ్యారు. గ్రామాల్లో సైతం అత్యధికంగా 450పంచాయతీల్లో మహిళా సర్పంచులే పాలన సాగిస్తుండగా మండల, జడ్పీ పాలనపై కూడా నారీ కీరిటం ధగధగ మెరిసింది. ఉమ్మడి కర్నూల్ జిల్లాలో 53మండలాలకు స్థానిక సంస్థల ఎన్నికలు జరగగా 32మంది మహిళలే ఎంపిపిలుగా ఎన్నిక కావడం మహిళల యొక్క ప్రాధాన్యతను తెలియజేస్తోంది. మరోవైపు 52మంది జడ్పీటీసీల్లో 27మంది మహిళలు జడ్పీటీసీలుగా ఉమ్మడి కర్నూల్ జిల్లాలో ఎన్నికయ్యారు. దీంతో ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో మహిళా మార్క్ స్పష్టంగా కనబడుతోంది. వైసీపీ ప్రభుత్వం ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్ అధికారం చేపట్టిన నాటి నుండి మహిళలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారు. నామినేటెడ్ పోస్టులు, ప్రభుత్వ పథకాల్లో రిజర్వేషన్ల పుణ్యమా అంటూ అతి సామాన్యుడికి కూడా పరిపాలించే అవకాశం దక్కింది. ఇంకో వైపు ప్రభుత్వ నిర్ణయంతో అర్థాంగిగా పిలువబడే మహిళ అర్ధబాగానికి పైగా పదవుల్లో అసీనులయ్యారు. ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళలు నేడు మేముసైతం అంటూ అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా ముందుకు దూసుక వెళుతున్నారు. ఇదే సమయంలో అంతే ఉత్సాహంగా ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న ప్రోత్సాహం వృధా కాదంటున్నారు నారీమణులు. మరోవైపు అనేక రంగాల్లో మహిళలకే అత్యధిక ప్రాధాన్యత నిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలకు రూపకల్పన చేసి అమలు చేస్తున్నాయి. గత పంచాయతీ ఎన్నికల్లో సైతం ఉమ్మడి కర్నూల్ జిల్లాలో 896 పంచాయతీలకు ఎన్నికలు జరుగగా ఇందులో 52శాతం మహిళలకు కేటాయించడం గమనార్హం. మరోవైపు ఇందిరమ్మ ఇళ్ళు, భూపంపిణీ, అభయహస్తం లాంటి అనేక పథకాలు మహిళల కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. అదే విధంగా బాలింతలు, గర్భిణులు, చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందజేస్తున్నారు. అదే సమయంలో కౌమార దశ దాటిన వారిపై కూడా ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ఇక చట్ట సభల్లో రిజర్వేషన్ కల్పించడం ద్వారా రాజకీయల్లో కూడా మహిళలు తమదైన శైలిలో రాణించి, ప్రతిభను చటడానికి అవకాశం ఏర్పడింది. దీంతో గల్లీ నుండి ఢీల్లీ దాకా మహిళలదే కీలకపాత్రగా మారనుంది. స్వతహగా ఏంతో పొదుపు, క్రమశిక్షణ కలిగిన మహిలా మణులకు ఈ అవకాశం అందించడం శుభ పరిణామమేనని పలువురు మేధావులు పెర్కొంటున్నారు. ఒక కుటుంబం సంతోషంగా జీవిస్తోందంటే అకుటుంబంలోని మహిళల పాత్ర ఏంతో కీలకమన్న విషయం ప్రతి ఒక్కరికి తెలిసిందేనని, అదే సందర్భంలో గ్రామం, దేశం సంతోషంగా వుండటానికి మహిళా పాలన ఏంతో ఉపకరిస్తుందని వారు పెర్కొంటున్నారు. మహిళా ప్రగతితోనే దేశాభివృద్ధి సాధ్యమన్న విషయం ప్రభుత్వాలు గుర్తించినందునే మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తున్నాయని అంటున్నారు.